
teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 02 | సంచిక : 340 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శనివారం | 13 ఏప్రిల్ 2024 | పేజీలు : 08 | వెల ‘ 5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.



## తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు

### అంచనా వేసిన ఐఎండీ హైదరాబాద్

హైదరాబాద్, ఏప్రిల్ 12 (తీన్మార్ న్యూస్): తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షం పడే అవకాశం ఉందని తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ తెలిపింది. ఆదిలాబాద్, నిర్మల్, కుమురం భీమ్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, సంగారెడ్డిలో ఉరుములు, మెరుపులతో

మిగతా 2 లో

## పార్టీ ఫిరాయించిన ఎమెల్యేలు రాజీనామా చేయాల్సిందే

**రాజీనామా చేయకపోతే ఇండ్లముందు చావుడప్పులు కొడతాం**

**వారిపై ఫిర్యాదుకు స్పీకర్ అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు**

**పార్టీ ఫిరాయించిన వారిని హెచ్చరించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు**

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 12 (తీన్మార్ న్యూస్) పార్టీ ఫిరాయించిన ఎమెల్యేలు రాజీనామా చేయకపోతే వారి ఇండ్లముందు ధర్నాలు చేస్తామని, చావుడప్పులు కొడతామని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హెచ్చరించారు. ఈ విషయంలో ఎవ్వర్నీ వదిలే ప్రసక్తే లేదని చెప్పారు. పార్టీలు మారిన ఎమ్మెల్యేలను రాళ్లతో ఉరికించి కొట్టాలి. నడిబజారులో ఉరితీయాలి అంటూ గతంలో చేసిన వ్యాఖ్యలకు సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉండాలని సవాల్ చేశారు. గురువారం తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

మిగతా 2 లో

## రాష్ట్రంలో గృహజ్యోతికి బ్రేక్

**ఎన్నికల కోడ్ ఎఫెక్ట్.. సీన్ రివర్స్**

**కోడ్ కారణంగా నమోదు ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటన**

**కొత్త పథకము.. కొత్త వారికి అమలు చేయలేని పరిస్థితి**





తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 12 (తీన్మార్ న్యూస్): గృహజ్యోతి పథకానికి బ్రేక్ పడనుంది. ప్రస్తుతం దేశం మొత్తం ఎన్నికల హడావుడి నడుస్తోంది. నోటిఫికేషన్లు వచ్చేశాయి. దాంతో పాటూ ఎన్నికల కోడ్ కూడా అమల్లోకి వచ్చేసింది. కాబట్టి ప్రస్తుతం దేశంలో చాలా వాటికి రిస్ట్రిక్షన్ వచ్చేశాయి. ఏ ప్రభుత్వమూ కొత్త పథకాలను మొదలుపెట్టడానికి వీలు లేదు. ఇప్పటికే అమలులో ఉన్నవాటిని మాత్రం కొనసాగించవచ్చును. దీంతో తెలంగాణలో అమలు అవుతున్న గృహజ్యోతి పథకానికి కూడా

మిగతా 2 లో





## రామాంజపూర్ శివారు సర్వే. నెం 602/11లో భూ కబ్జాకు యత్నం



**కోర్టులో కేసు రన్నింగు.. భూమిలో దౌర్జన్యం**

**పట్టించుకోవడం లేదంటూ ఎస్ఐపై బాధిత రైతు ఆరోపణలు**

**రాజకీయానికి తప్ప.. పేదరికానికి న్యాయం జరగదా...?**

**ఆధారాలున్నా అయోమయంలో రైతు కుటుంబం**

ములుగు, ఏప్రిల్ 12 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా వెంకటపూర్ మండలంలోని రామాంజపూర్ గ్రామంలోని సర్వ బిక్షపతి తండ్రి కొమురయ్యకు రామాంజపూర్ శివారు 602/11 భూమి వారసత్వం కింద సంక్రమించగా ఈ సర్వే

మిగతా 2 లో



## లిక్కర్ స్కామ్ లో కవిత పాత్రను క్షుణ్ణంగా వెల్లడించిన సీబీఐ

**విస్తుగొలిపే మరిన్ని నిజాలను బహిర్గతం చేసింది సీబీఐ**

**శరత్ చంద్రారెడ్డిని కవిత బెదిరించినట్లు కస్టడీ రిపోర్ట్‌లో వెల్లడి**

**భూమే లేకుండా భూమి కొనుగోలు చేసినట్లు అగ్రిమెంట్లు**

**మరిన్ని విషయాలను రాబట్టాల్సి ఉందని కోర్టును కోరిన సీబీఐ**

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 12 (తీన్మార్ న్యూస్): ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత పాత్ర ఏంటో క్షుణ్ణంగా వెల్లడించింది సీబీఐ. ఈ కుంభకోణంలో విస్తుగొలిపే మరిన్ని నిజాలను బహిర్గతం చేసింది సీబీఐ. కవితే రూ. 100 కోట్లు చెల్లించినట్లు సీబీఐ కస్టడీ రిపోర్ట్‌లో పేర్కొంది. శరత్ చంద్రారెడ్డి కవిత జాగృతి సంస్థకు రూ. 80 లక్షల ముడుపులు చెల్లించినట్లు సీబీఐ తెలిపింది. డబ్బుల

మిగతా 2 లో



## జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించనున్న బీఆర్ఎస్

**కూటమి పార్టీలు మెజారిటీ సాధించకపోవచ్చని కేటీఆర్ జోస్యం**

.. వివరాలు 2లో

## అంతరాష్ట్ర సరిహద్దుల్లో ప్రత్యేక నిఘా

### నోటిఫికేషన్‌కు ముందే పట్టుబడుతున్న నోట్ల కట్టలు

**తెలంగాణలో 145 కంపెనీల కేంద్ర బలగాలతో బందోబస్తు**

**సోషల్ మీడియా పోస్టింగ్స్‌పై పోలీసుల నిఘా**

**ఎన్నికల నేపథ్యంలో సమాచార మార్పిడికి పోలీస్ వాట్సాప్ గ్రూప్**



లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోకి డబ్బు, మద్యం అక్రమ రవాణా కట్టడికి తెలంగాణ పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. సరిహద్దు జిల్లాల కమిషనర్లు, ఎస్పీలు పొరుగు రాష్ట్రాల సరిహద్దు జిల్లా పోలీసు అధికారులు, కేంద్ర బలగాల అధికారులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశారు.

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 12 (తీన్మార్ న్యూస్): నిరంతరం, సత్వర సమాచార మార్పిడికోసం ప్రత్యేక వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేశారు. పోలీసులతోపాటు రెవెన్యూ, ఇతర విభాగాల అధికారులను ఆ గ్రూపులో చేర్చారు. కాగా తెలంగాణలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల బందోబస్తుకు 145 కంపెనీల కేంద్ర బలగాలు రంగంలోకి దిగుతున్నాయి. ఇప్పటికే 60 కంపెనీల కేంద్ర బలగాలు రాష్ట్ర

మిగతా 2 లో

## తెలంగాణలో ముగిసిన ఇంటర్ స్పాట్ వాల్యూయేషన్

**మొత్తం 4 విడతల్లో వాల్యూయేషన్ ప్రక్రియ కంప్లీట్**

**కోడింగ్, డీకోడింగ్ ప్రక్రియ పూర్తికాగానే ఫలితాల వెల్లడి**

**ఒకేసారి ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ ఫలితాలు ప్రకటించే ఛాన్స్**

హైదరాబాద్, ఏప్రిల్ 12 (తీన్మార్ న్యూస్): తెలంగాణలోని విద్యార్థులు కూడా ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సంవత్సరానికి సంబంధించి 9 లక్షల మందిపైగా

మిగతా 2 లో



## వరంగల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా మారేపల్లి సుధీర్

**చివరి నిమిషంలో తాటికొండ రాజయ్యకు బీఆర్ఎస్ ట్విస్ట్**

**ఈ స్థానం పోటీలో కాంగ్రెస్ నుంచి కడియం కావ్య,బీజేపీ నుంచి ఆరూరి రమేష్**

.. వివరాలు 2లో

## బీజేపీ, బీఆర్ఎస్‌పై మంత్రి సీతక్క ఫైర్

### ఓట్ల కోసం రెండు పార్టీలు కాంగ్రెస్‌పై తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని మంత్రి మండిపాటు



మహబూబాబాద్, ఏప్రిల్ 12 (తీన్మార్ న్యూస్): బీజేపీ, బీఆర్ఎస్‌పై మంత్రి సీతక్క ఫైర్ అయ్యారు. ఓట్ల కోసం రెండు పార్టీలు కాంగ్రెస్‌పై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మంత్రి సీతక్క మండిపడ్డారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తోడు దొంగల నాటకం ఆడుతున్నారని విమర్శించారు. ప్రతిపక్ష

మిగతా 2 లో

## రాష్ట్రంలో గృహజ్యోతికి బ్రేక్

**మొదటి పేజీ తరువాయి**

అడ్డు వచ్చింది. ఇప్పటికే చాలా మంది ఈ పథకానికి దరఖాస్తులు చేసుకున్నారు. వారికి యథావిధిగానే గృహజ్యోతి పథకం ప్రకారం ఉచిత కరెంట్ ఇస్తారు. కానీ కొత్తగా దరఖాస్తు చేసుకునేవారికి మాత్రం ఇప్పుడు పథకాన్ని అమలు చేయలేరు. ఎన్నికలు అయ్యాక కోడ్ ముగిసిన వెంటనే కొత్త దరఖాస్తులకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తామని చెబుతోంది కాంగ్రెస్ ప్రభుత్వం. గృహజ్యోతి కింద గత నెలలో 36 లక్షల ఇళ్లకు జీరో కరెంటు బిల్లులు అమలు చేస్తామని చెప్పింది. రాష్ట్ర వ్యాప్తంగా 80 లక్షలకుపైగా రేషన్ కార్డులు ఉండగా తమకు ఉచిత విద్యుత్ కావాలంటూ వేలల్లో దరఖాస్తులు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతానికి ఎన్నికల కోడ్ కారణంగా నమోదు ప్రక్రియను నిలిపివేస్తున్నామని తెలిపారు. మళ్లీ జూన్ నుంచి కొత్త దరఖాస్తులకు ఆమోదం ఉంటుందని చెప్పారు. గృహజ్యోతి పథకం వలన జీరో బిల్లుల రాయితీ సొమ్ము రూ.300 కోట్లకు చేరే ఛాన్స్ ఉందని ఆ మొత్తాన్ని డిస్కంలకు ప్రభుత్వం చెల్లిస్తుందని చెబుతున్నారు.

## పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు రాజీనామా చేయాల్సిందే

**మొదటి పేజీ తరువాయి**

కేపీ వివేకానంద, పాడి కౌశిక్‌రెడ్డి, కోవ లక్ష్మి మీడియా సమావేశం నిర్వహించారు. కేపీ వివేకానంద మాట్లాడుతూ సొంత పార్టీ ఎమ్మెల్యేలపై నమ్మకం లేకనే రేవంత్‌రెడ్డి ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుపై అనర్హత వేటు వేయాలని కోరేందుకు తమకు స్పీకర్ సమయం ఇవ్వడం లేదని ఆరోపించారు. దీంతో లీగల్ టీమ్‌తో సంప్రదించి, రిజిస్టర్ పోస్టులోనూ, మెయిల్ ద్వారా స్పీకర్ కార్యాలయానికి పిటిషన్ పంపించినట్టు వెల్లడించారు. పార్టీ మారిన వారిపై వెంటనే అనర్హత వేటు వేయాలని కోరినట్టు తెలిపారు. అనర్హతల పిటిషన్లపై మూడు నెల్లలో సరైన నిర్ణయం తీసుకోవాలనే సుప్రీంకోర్టు వ్యాఖ్యలను కూడా జత చేశామని చెప్పారు. హిమాచల్‌ప్రదేశ్‌లో పార్టీ ఫిరాయించిన వారిని అనర్హులుగా అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిందని గుర్తుచేశారు. పార్టీ మారిన వారిపై చర్యలు తీసుకోకపోతే ఎలాంటి పోరాటం చేయడానికైనా సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. సుప్రీంకోర్టు తీర్పుకు రాజకీయ రంగు పులుమితే ఎక్కడికక్కడ ధర్నాలు, దీక్షలు చేస్తామని, వెనకడుగు వేయబోమని హెచ్చరించారు.

**ఫిరాయింపుదారులకు డిపాజిట్లు దక్కవు**

దానం నాగేందర్ పార్టీ మారిన అంశంపై మార్చి 18న స్పీకర్‌కు ఫిర్యాదు చేశామని, ఆయన ఎలాంటి చర్య తీసుకోకపోవడంతో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశామని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తెలిపారు. ఆ కేసు వచ్చే సోమవారం వాదనకు వస్తుందని, దానం నాగేందర్‌తోపాటు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుపై అనర్హత వేటు తప్పదని జోస్యం చెప్పారు. హైకోర్టులో తమకు అనుకూలంగా తీర్పు వస్తుందనే నమ్మకాన్ని వ్యక్తంచేశారు. ప్రజాపాలనంటూ గొప్పలు చెప్పుకుంటున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో పిటిషన్ తీసుకునేందుకు స్పీకర్ కార్యాలయం భయపడుతున్నదని పేర్కొన్నారు. పార్టీ మారినోళ్లకు సిగ్గు, శరం ఉంటే, మొగోళ్లే అయితే, దమ్ము, ధైర్యం ఉంటే వెంటనే రాజీనామా చేసి, మళ్లీ పోటీకి సిద్ధం కావాలని సవాల్ విసిరారు. ఈ మూడు నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రావడం ఖాయమని, ఫిరాయింపుదారులకు డిపాజిట్లు కూడా రాకుండా అడ్డుకుంటామని చెప్పారు.

## లిక్కర్ స్కామ్ లో కవిత పాత్రను క్షుణ్ణంగా వెల్లడించిన సీబీఐ

**మొదటి పేజీ తరువాయి**

కోసం శరత్ చంద్రారెడ్డిని కవిత బెదిరించారని సీబీఐ వెల్లడించింది. ల్యాండ్ డీల్ చేసుకోకపోతే తెలంగాణలో బిజినెస్ ఎలా చేస్తావో చూస్తానని శరత్ చంద్రారెడ్డిని కవిత బెదిరించినట్లు కస్టడీ రిపోర్ట్‌లో పేర్కొన్నారు. అసలు భూమే లేకుండా వ్యవసాయ భూమి కొనుగోలు చేసినట్లు అగ్రిమెంట్లు, రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించారంది. నకిలీ భూ విక్రయం పేరుతో శరత్ చంద్రారెడ్డి నుంచి రూ. 14 కోట్లు కవిత తీసుకున్నారని సీబీఐ ఆరోపించింది. ఢిల్లీ లిక్కర్ బిజినెస్‌కు పరిచయం చేసినందుకు కవితకు చెందిన తెలంగాణ జాగృతి సంస్థకు శరత్ చంద్రారెడ్డి రూ. 80లక్షలు చెల్లించారట. మహబూబ్ నగర్‌లో వ్యవసాయ భూమి ఉందని, దాన్ని కొనుగోలు చేసినట్లు రూ. 14 కోట్లు ఇవ్వాలని శరత్ చంద్రారెడ్డిని కవిత డిమాండ్ చేశారట. అసలు ఆ భూమి సంగతి, దాని ధర ఎంతో తెలియనందువల్ల తాను రూ.14కోట్లు ఇవ్వలేని శరత్ చంద్రారెడ్డి చెప్పారట. కానీ, రూ. 14 కోట్లు ఇవ్వకపోతే తెలంగాణలో అరబిందో ఫార్మా బిజినెస్ ఉండదని కవిత బెదిరించారని సీబీఐ తన కస్టడీ రిపోర్ట్‌లో పేర్కొంది. ఒక్కో రిటైల్ జోన్‌కి రూ.5 కోట్లు చెప్పున 5 రిటైల్ జోన్‌లకు రూ.25 కోట్లు ఇవ్వాలని శరత్ చంద్రారెడ్డిని కవిత డిమాండ్ చేశారట. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని కూడా కవిత రూ. 50 కోట్లు డిమాండ్ చేశారట. తన కుమారుడు మాగుంట రాఘవ ద్వారా కవితకు ఆయన రూ.25కోట్లు చెల్లించారని సిబిఐ ఆరోపించింది. కేజ్రీవాల్ అనుచరుడు విజయనాయర్‌కి కవితే రూ.100కోట్లు చెల్లించారని సీబీఐ తెలిపింది. అలా ఇండో స్పిరిట్స్‌లో 65శాతం వాటా పొందారట. గోవాకు రూ.44.45 కోట్లు హవాలా మార్గంలో బదిలీ చేశారట. ఈ డబ్బును కవిత పిఏ అశోక్ కౌశిక్ హవాలా డీలర్లకు చేర్చాడట. ఈ విషయాలన్నింటిపైనా కవిత సరైన సమాధానాలు చెప్పడం లేదని ఆమెను 5 రోజులు కస్టడీలోకి తీసుకొని మరిన్ని విషయాలను రాబట్టాల్సి ఉందని ప్రత్యేక కోర్టును సీబీఐ కోరింది.

## జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించనున్న బీఆర్ఎస్

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 12 (తీన్మార్ న్యూస్): వచ్చే లోకసభ ఎన్నికల్లో హంగ్ ఏర్పడితే జాతీయ రాజకీయాల్లో బీఆర్ఎస్ కీలక పాత్ర పోషిస్తుందని అభిప్రాయపడ్డారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. లోకసభ ఎన్నికల్లో జాతీయ కూటమి పార్టీలు అవసరమైన మెజారిటీ సాధించకపోవచ్చని ఆయన జోస్యం చెప్పారు. ఈ మేరకు లోకసభ ఎన్నికల్లో భారీ సంఖ్యలో సీట్లు దక్కించుకుని జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తామన్నారు కేటిఆర్. ఈ రోజు శుక్రవారం ఇబ్రహీంపట్నంలో జరిగిన భువనగిరి పార్లమెంటరీ నియోజకవర్గ కేడర్ సమావేశంలో కేటీఆర్ పాల్గొని కేడర్ కు దిశానిర్దేశం చేశారు. కేటీఆర్ మాట్లాడుతూ పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాల జీవితాలను ఛిద్రం చేస్తున్న ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయలేక ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ ఘోరంగా విఫలమయ్యారని కేటీఆర్ విమర్శించారు. ఇక మోడీని బండి సంజయ్ దేవుడు అని పిలుస్తాడని కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణకు నరేంద్ర మోదీ కూడా చేసిందేమీ లేదు. తెలంగాణకు ఒక్క నవోదయ పాఠశాల లేదా వైద్య కళాశాల మంజూరు చేయలేదని ఆరోపించిన కేటీఆర్ బిజెపి అభ్యర్థులను ఎలా ఎన్నుకుంటామని ప్రశ్నించారు. తెలంగాణలో నాలుగు నెలల కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించిన కేటీఆర్ రంగారెడ్డి జిల్లాలో రియల్ ఎస్టేట్ రంగాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నాశనం చేసిందని అన్నారు. అభివృద్ధి చెందిన రియల్ ఎస్టేట్ రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వానికి అప్పగించాము. కానీ వారి నిర్ణయాల వల్ల తెలంగాణలో కంపెనీలు పారిపోయే స్థితికి వచ్చాయని అన్నారు. మహేశ్వరంలో ఫార్మా సిటీ సిద్ధంగా ఉంది, దాన్ని రేవంత్ రెడ్డి అడ్డుకున్నారు. రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్‌కు పర్యాయపదమని అన్నారు కేటీఆర్. ఇక కొత్త ప్రభుత్వంతో ఫాక్స్‌కాన్ ఎలా వ్యవహరిస్తుందో మాకు తెలియదు. ఫాక్స్‌కాన్ అభివృద్ధిపై స్థానిక బీఆర్ఎస్ నాయకులు నిఘా ఉంచాలని కోరుతున్నాను అని కేటీఆర్ అన్నారు. తప్పుడు వాగ్దానాలతో ఓటర్లను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల తర్వాత మహిళలకు ఉచిత బస్సు సర్వీసు పథకాన్ని రద్దు చేస్తుందని కేటీఆర్ అన్నారు.

## వరంగల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా మారేపల్లి సుధీర్


వరంగల్, ఏప్రిల్ 12 (తీన్మార్ న్యూస్): వరంగల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్ ను ఖరారు చేశారు పార్టీ అధినేత కేసీఆర్. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన సుధీర్ కుమార్ ప్రస్తుతం హన్మకొండ జడ్పీ ఛైర్మన్ గా కొనసాగుతున్నారు. 2001 నుండి తెలంగాణ ఉద్యమకారుడిగా, పార్టీకి విధేయుడుగా, అధినేతతో కలిసి పనిచేస్తున్న సుధీర్ కుమార్ సరైన అభ్యర్థిగా ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ ముఖ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ మేరకు అందరితో చర్చించి వారి సలహా సూచనల మేరకు కేసీఆర్ సుధీర్ కుమార్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసి ప్రకటించారు. వరంగల్ ఎంపీ టికెట్ ను తాటి కొండ రాజయ్య కూడా ఆశించారు. ఏప్రిల్ 12న మధ్యాహ్నం కేసీఆర్ ఫామ్ హౌజ్ కు కూడా వెళ్లారు. రాజయ్యకు టికెట్ కన్ఫర్మ్ అని అనుకున్నారంతా, కానీ చివరి నిమిషంలో సుధీర్ కుమార్ ను కన్ఫర్మ్ చేసి ట్విస్ట్ ఇచ్చారు కేసీఆర్. వరంగల్ ఎంపీగా కాంగ్రెస్ నుంచి కడియం కావ్య పోటీచేస్తుండగా బీజేపీ నుంచి ఆరూరి రమేష్ పోటీచేస్తున్నారు.


## తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు

**మొదటి పేజీ తరువాయి**

కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో ఏప్రిల్ 11 గురువారం కురిసిన చెదురుమదురు వర్షాల తర్వాత, ఏప్రిల్ 12 శుక్రవారం మరిన్ని వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హైదరాబాద్ అంచనా వేసింది. గురువారం వరంగల్, నారాయణపేట, సంగారెడ్డి, నాగర్‌కర్నూల్, వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, సంగారెడ్డి, కామారెడ్డి, కుమురం భీమ్, ఆదిలాబాద్, మంచిర్యాలలో అక్కడక్కడా వర్షాలు కురిశాయి. ఏప్రిల్ 14న తెలంగాణలోని ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ ఐఎండీ తెలిపింది.

# రామాంజపూర్ శివారు సర్వే. నెం 602/11లో భూ కబ్జాకు యత్నం










**మొదటి పేజీ తరువాయి**

నెంబర్ లొ గత ఉమ్మడి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ లో ఆ ప్రభుత్వం ఇచ్చిన పట్టా పాస్ బుక్ మరియు గత పది సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రవేశపెట్టిన ధరణి ద్వారా కూడా పట్టా పాస్ బుక్, గత సెత్వారి పహాణిలలో, ఆన్లైన్ పహాణిలలో, కాస్తులో ఉన్నది, ఉన్న పేరు సర్వ బిక్షపతి పేరునే. కాగా గత 6 నెలల క్రితం అట్టి భూమిని కొందరు కాంగ్రెస్ నాయకులు కబ్జా చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు సర్వ బిక్షపతి మరియు కుటుంబ సభ్యులు. న్యాయం కొరకు వారి దగ్గర ఉన్న ఆధారాలతో కోర్టులో కేసు వేయగా గౌరవ కోర్టు వారు ఆధారాలు పరిశీలించి ఇంజక్షన్ ఆర్డర్ జారీ జరిగింది. అప్పుడప్పుడు బెదిరిస్తూ, బయపెడుతూ కొంత కాలం నిశ్శబ్దంగా ఉండి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారు మళ్లీ రాజకీయ బలంతో, స్థానిక అధికారుల అండతో కబ్జాదారులు రెచ్చిపోతున్నారని వాపోయారు. గురువారం సాయంత్రం సుమారు 4గం.కు ఎవరు లేని సమయంలో అట్టి భూమిలో ఖాబ్జాదారులు ఖని రాళ్లు పాతివెళ్లారని సర్వ బిక్షపతి మరియు వారి కుటుంబ సభ్యులు తెలియచేశారు. అనంతరం వారు సమీప వెంకటాపూర్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ లో శుక్రవారం కంప్లెంట్ ఇవ్వడానికి వెళ్లగా స్థానిక ఎస్సై కంప్లెంట్ ను తీసుకోవడానికి నిరాకరించారని, కోర్ట్ ఇంజక్షన్ ఆర్డర్ ఉందని తెలిపాక కూడా వారే వచ్చి గ్రామపంచాయతీలో పంచాయతీ చేస్తానని అన్నట్లుగా



బాధితులు ఆరోపంచారు. ఆధారాలు ఉన్నాయని తెలిపినా పట్టించుకోకుండా.. అన్యాయానికి సంబందించిన కబ్జా పిర్యాదు స్వికరించకుండా పంచాయితికి వస్తా.. అక్కడే తెలుస్తా అంటూ మండల పరిధి ఎస్ఐ దురుసుగా మాట్లాడాడు అంటూ తెలుపుతూ.. ఇక న్యాయం చేయమని ఎవరికీ చెప్పుకోవాలో దిక్కు తోచని పరిస్థితిలో ఉన్నామంటూ బాధితులు బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక కబ్జాకు యత్నిస్తున్నా.. ఖనీలు పాతారని తెలిపినా.. పిర్యాదు రాసుకొని వెళ్లి ఇస్తామని సూచించినా.. స్వికరించకపోవడం పట్ల పోలీసులు, అధికారులు న్యాయం పట్ల నిలిస్తే లాభం ఎం వస్తుంది అనుకుంటున్నారో ఏమో అంటూ.. అధికార రాజకీయ బలానికి తలొగ్గుతున్నట్లుగా వారి వ్యవహారాన్ని భావిస్తూ.. పేదల వైపు న్యాయం ఉన్నా జరగదేమో అని అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తూ సందేహిస్తూ దిగ్భ్రాంతికి లోనైనారు. ఈ పరిస్థితిలో పోలీసుల, అధికారుల ఒత్తిడి వల్ల గాని.. ఖబ్జాదారుల వల్ల గాని కుటుంబానికి ఏమైనా జరుగుతే భాద్యులేవరంటూ భయభ్రాంతుల్లో.. శోక సంద్రంలో కుటుంబం మొత్తం మునిగిపోయారు. కోర్టు ఇచ్చిన ఇంజక్షన్ ఆర్డర్ ను పాటించవలసిన అధికారులే ఇలా అంటుంటే పేదవాడికి న్యాయం అందని ద్రాక్షేనా.. లేదా మా బ్రతుకింతేనా..

అనే అయోమయంలో పడిపోయారు. ఇక మున్ముందు మండల పరిధి పోలీసులు గాని, అధికారులు గాని, రాజకీయ ప్రతినిధులు గాని ఈ కబ్జా యత్నం ఘటన విషయంలో, బెదిరింపులకు విషయంలో సర్వ బిక్షపతికి ఏ విధంగా న్యాయం చేయబోతారనేది ప్రశ్నర్థకంగా ఉన్నది.

## తెలంగాణలో ముగిసిన ఇంటర్ స్పాట్ వాల్యూయేషన్

**మొదటి పేజీ తరువాయి**

విద్యార్థులు పరీక్షలు రాశారు. వీరంతా కూడా ఫలితాల కోసం వెయిట్ చేస్తున్నారు. తెలంగాణతో పోల్చితే ఏపీలో ఒక్కరోజు ఆలస్యంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఏపీలో మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు ఎగ్జామ్స్ జరిగాయి. కానీ తెలంగాణలో ఈసారి ఫిబ్రవరి 28వ తేదీ నుంచే స్టార్ట్ అయ్యాయి. మార్చి 19వ తేదీతో ఎగ్జామ్స్ పూర్తి అయ్యాయి. అయింతే ఏపీలో మాత్రం రికార్డు స్థాయిలో కేవలం 22 రోజుల వ్యవధిలోనే ఫలితాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇక తెలంగాణలో స్పాట్ ప్రక్రియ పూర్తి కావటంతో మిగతా ప్రక్రియలను కూడా పూర్తి చేస్తున్నట్లు తెలిసింది. సాధ్యమైనంత త్వరగా ఫలితాలను ప్రకటించేందుకు అధికారులు సమయాత్తం అవుతున్నారు. తెలంగాణలో ఇంటర్ స్పాట్ వాల్యూయేషన్ పూర్తి అయింది. ఈ ప్రక్రియను మార్చి 10వ తేదీన ప్రారంభించంగా మొత్తం 4 విడతల్లో కంప్లీట్ చేశారు. ఏప్రిల్ మొదటి వారంలోపు మూల్యాంకన ప్రక్రియ అంతా కూడా పూర్తి అయింది. అయితే మార్కుల ఎంట్రీతో పాటు ఎలాంటి సాంకేతికపరమైన ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు అధికారులు. ఒకటికి రెండుసార్లు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఫలితాల తేదీని ప్రకటించే అవకాశం ఉంది. కోడింగ్, డీకోడింగ్ ప్రక్రియ పూర్తి చేసిన వెంటనే ఫలితాలను వెల్లడించనున్నారు. ఈసారి కూడా ఒకేసారి ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ ఫలితాలను ఒకేసారి ప్రకటించే ఛాన్స్ ఉంది. గతంలో మాదిరిగా కాకుండా ఈసారి తొందరగానే తెలంగాణ ఇంటర్ ఫలితాలు రానున్నాయి. 2023 ఏడాదిలో మే 9వ తేదీన ఫలితాలను ప్రకటించారు. అయితే ఈసారి మాత్రం ఏప్రిల్ 21 -25వ తేదీలోపు ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో ఈసీ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే ఆ దిశగా అధికారులు అడుగులు వేస్తుడంగా ఈసీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వగానే ఫలితాల విడుదలకు ముహూర్తం ఖరారు కానుంది. దాదాపు ఏప్రిల్ చివరి వారంలోని ఏ తేదీలోనైనా వెల్లడించే ఛాన్స్ ఉంది. ఎంసెట్ తో పాటు మరిన్ని పరీక్షల దృష్ట్యా వీలైనంత త్వరగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని విద్యాశాఖ భావిస్తోంది.

## కేవి స్కూల్లలో ఎంపీల సిఫార్సుల అడ్మిషన్ల విధానం రద్దు

### ప్రభుత్వ ఉద్యోగి, పిఎస్యూ, మాజీ సైనికుల పిల్లలకు ప్రాధాన్యం

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 12 (తీన్మార్ న్యూస్): భారతదేశంలో అత్యున్నత ప్రమాణాలతో పాఠశాల విద్యను అందించే సంస్థల్లో కేంద్రీయ విద్యాలయాలు ముందుంటాయి. ఇవి కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తాయి. అందుకే చాలా మంది పేరెంట్స్ తమ పిల్లలను కేంద్రీయ విద్యాలయాల్లో చేర్పించడానికి ఆసక్తి చూపుతుంటారు. ఇక్కడ అడ్మిషన్ పొందడం అంత ఈజీ కాదు. ఎంట్రన్స్ ఎగ్జామ్‌లో క్వాలిఫై మార్కులు సాధించాలి. దీంతోపాటు ప్రత్యేక కోటాల్లో కూడా ప్రవేశాలు పొందవచ్చు. ముఖ్యంగా ఎంపీ కోటా కూడా ఉంది. అయితే ఈ స్కూళ్లలో ఎంపీల సిఫార్సుల ప్రకారం అడ్మిషన్లు అందించే విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. కేంద్రీయ విద్యాలయ అడ్మిషన్ల సమయంలో ఒక విద్యార్థికి ప్రిఫరెన్స్ అందించే వివిధ మార్గాలు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగి పిల్లలు, పిఎస్యూ, మాజీ సైనికుల పిల్లలు ప్రాధాన్యం పొందవచ్చు. ఈ ప్రత్యేక కోటాలు పోగా మిగిలిన సీట్లలో సామాన్యుల పిల్లలకు ప్రవేశం కల్పిస్తారు. అయితే ఇటీవల కేంద్రీయ విద్యాలయలో ప్రవేశానికి ఉపయోగపడే చాలా కోటాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఇందులో ఎంపీ కోటా కూడా ఉంది. దీంతో పాటు జిల్లా అధికారులు, మాజీ ఉద్యోగులు, అధికారుల కోటాలను కూడా 2022లో రద్దు చేశారు. ఇంతకు ముందు అడ్మిషన్ల కోసం ఎంపీ కోటా అందుబాటులో ఉండేది. ఎంపీ కోటా ప్రకారం ప్రతి సంవత్సరం కేంద్రీయ విద్యాలయలో అకడమిక్ సెషన్ ప్రారంభంలో 10 మంది పిల్లలకు అడ్మిషన్ సిఫార్సు చేసే అధికారం పార్లమెంటు సభ్యునికి ఉంటుంది. 1 నుంచి 9 తరగతులలో ప్రవేశానికి సిఫార్సులు చేయవచ్చు. ఎంపీ నియోజకవర్గానికి చెందిన తల్లిదండ్రులు ఉన్న పిల్లలను మాత్రమే ఎంపీ సిఫార్సు చేయగలరు.



**వివిధ కోటాల రద్దు**

నివేదిక ప్రకారం ఎంపీ కోటా ద్వారా ప్రతి సంవత్సరం 7880 మంది విద్యార్థులు కేంద్రీయ విద్యాలయలో ప్రవేశం పొందుతున్నారు. ఎక్కువ మంది అడ్మిషన్ల కోసం ఈ ఆప్షన్ వినియోగించుకున్న కారణంగా ఈ సంఖ్య మరింత పెరిగింది. 2018-19 సెషన్‌లో, ఎంపీ కోటా కింద మొత్తం 8,164 అడ్మిషన్లు జరిగాయి. ఆ తర్వాత 2019-20లో దీని ద్వారా దాదాపు 9411 మంది పిల్లలు కేంద్రీయ విద్యాలయలో ప్రవేశాలు పొందారు. 2021-22 సెషన్‌కు ఇలా 7301 అడ్మిషన్లు జరిగాయి. చివరకు 2022లో ఈ కోటాను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రద్దు చేశారు. మహావీర్ చక్ర, పరమవీర చక్ర, అశోక్ చక్ర, వీర చక్ర, శౌర్య చక్ర, కీర్తి చక్ర అవార్డు గ్రహీతల పిల్లలు కేంద్రీయ విద్యాలయలో ప్రవేశాలకు అర్హులు. ఇలాంటి కొన్ని ప్రత్యేక కోటాలను కొనసాగిస్తున్నారు. తల్లిదండ్రులు అధికారిక వెబ్‌సైట్ %ఒఒఒ.ఎజయిఅ-స్త్రీఫ్ఖ్తుఅ.అఅఎ.అఅ% ద్వారా ఆన్‌లైన్‌లో తమ పిల్లల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. మరోవైపు, కెవిఎస్ ఈ సంవత్సరం ట్రాన్స్‌ఫర్ పాలసీని సవరించింది. ఇప్పుడు ప్రైవేట్ ఉద్యోగుల పిల్లలు స్టేట్ ట్రాన్స్‌ఫర్ సిస్టమ్‌ను ఉపయోగించుకోవడానికి వీలు లేదు. అంటే ప్రైవేట్ రంగంలో పనిచేస్తున్న తల్లిదండ్రులు వేరే రాష్ట్రానికి బదిలీ అయితే, వారి పిల్లలు ఇతర కేవీఎస్‌లకు ట్రాన్స్‌ఫర్ అయ్యే వీలు లేదు.

## బీజేపీ, బీఆర్ఎస్‌పై మంత్రి సీతక్క ఫైర్

**మొదటి పేజీ తరువాయి**

నాయకులను భయపెట్టి బీజేపీ పార్టీలో చేర్చుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలను అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని సీతక్క అన్నారు. ప్రజలు రాహుల్ గాంధీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహబూబాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి బాలరాం నాయక్ పాల్గొన్నారు.

## అంతరాష్ట్ర సరిహద్దుల్లో ప్రత్యేక నిఘా

**మొదటి పేజీ తరువాయి**

వ్యాప్తంగా బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నాయి. దశల వారీగా మిగతా బలగాలు బందోబస్తు విధుల్లోకి వచ్చి, చేరనున్నాయి. ఎన్నికల నాటికి కేంద్ర బలగాలతోపాటు సరిహద్దు రాష్ట్రాల నుంచి పోలీసు సిబ్బందిని బందోబస్తు విధుల్లో భాగస్వామ్యం చేయనున్నారు. మార్చి 16న లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి నిర్వహిస్తున్న తనిఖీల్లో ఇప్పటి వరకు సుమారు రూ.50 కోట్లు విలువైన నగదు, మద్యం, బంగారం, వెండి, ఇతర విలువైన సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గత లోక్‌సభ ఎన్నికల సమయంలో జరిపిన తనిఖీల్లో మొత్తం రూ. 45 కోట్లు విలువైన నగదు, మద్యం, బంగారం, వెండి, ఇతర విలువైన వస్తువులు పట్టుబడగా ఈ సారి ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే రూ.50 కోట్ల సొత్తు పట్టుబడటం గమనార్హం. నోటిఫికేషన్ వెలువడ్డ తర్వాత నగదు ప్రవాహం మరింత ఎక్కువగా ఉంటుందనే అంచనాల నేపథ్యంలో రాష్ట్రంతోపాటు, రాష్ట్ర సరిహద్దుల్లో తనిఖీలను ముమ్మరం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 466 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, రాష్ట్ర సరిహద్దుల్లో 85 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిరంతర నిఘా కొనసాగిస్తున్నారు.నోటిఫికేషన్ వెలువడ్డ తర్వాత ఫ్లయింగ్ స్క్వాడ్, చెక్‌పోస్టుల సంఖ్య మరింతగా పెంచనున్నట్లు అధికారులు తెలిపారు. చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది తనిఖీల తీరు, పట్టుబడుతున్న నగదు ఇతరాత్ర వాటిని ఉన్నతాధికారులు పర్యవేక్షించేందుకు వీలుగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేశారు. మరోవైపు ఎన్నికల ప్రచారంలో సోషల్ మీడియా కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో సోషల్ మీడియా పోస్టింగ్స్‌పై పోలీసులు నిఘా పెట్టారు. కాగా, ఈ నెల 19న తమిళనాడులో జరగనున్న లోక్‌సభ ఎన్నికల బందోబస్తుకు తెలంగాణ నుంచి 2 వేల మంది పోలీసులను తరలిస్తున్నారు.

## మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థిపై మంత్రి కొండా సురేఖ విమర్శలు

### కేసీఆర్ కాళ్లు మొక్కి మోసం చేయడానికే వస్తున్నాడంటూ వాఖ్యలు

హైదరాబాద్, ఏప్రిల్ 12 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ పార్టీ పై విమర్శలు గుప్పించారు మంత్రి కొండా సురేఖ. బీఆర్ఎస్ పార్టీ నాయకులకు కాంగ్రెస్ ను విమర్శించే హక్కు లేదన్నారు. మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి కేసీఆర్ కాళ్లు మొక్కి టికెట్ తెచ్చుకున్నారని ప్రజలను మోసం చేయడం కోసం వస్తున్నారని విమర్శించారు. ఎంపీలుగా బీఆర్ఎస్ అభ్యర్థులు గెలవగానే బీజేపీకి తాకట్టు పెడతారని ఆరోపించారు. సునీత లక్ష్మారెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచి తన సొంత లాభం కోసం బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్ళిందని విమర్శించారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని కొండా సురేఖ గుర్తు చేశారు. తెలంగాణ నుండి 14 నుండి 15 ఎంపీ సీట్లు గెలిచి సోనియా గాంధీకి ఇవ్వాలని సూచించారు. కార్యకర్తలతోనే ప్రభుత్వాలు వస్తాయని ప్రతి ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన ఆరు గ్యారెంటీల గురించి చెప్పాలని సూచించారు. బీసీ బిడ్డ నిరుపేద కుటుంబంలో పుట్టిన నీలం మదును గెలిపించాలని కొండా సురేఖ కోరారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# గేట్లెత్తేశాం.. మాటలే మేనిఫెస్టో!

తెలంగాణలో ఈసారి పార్లమెంటు ఎన్నికల హడావుడి ఉండాల్సన స్థాయి కన్నా తక్కువ ఉందేమో! 2018, 2019 సంవత్సరాల్లో ఈ చాలా రకాలుగా కనిపించింది. ఈసారి ఆ తేడా మరింతగా ఉన్నట్టుగా ఉంది. హైదరాబాదులోనే ఇలా ఉంటే మండే ఎండల మధ్య పల్లె సీమల్లో ఇంకెలా ఉంటుందో? కేవలం మాటలే మేనిఫెస్టోగా నడుస్తోంది తెలంగాణ రాజకీయ సరళి. పైపెచ్చు కాంగ్రెస్ గెలుస్తుందని 2023 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వస్తుండగానే తెలంగాణలో మీడియా కొత్తగా స్వేచ్ఛ వచ్చినట్లు ప్రవర్తించింది. సోషల్ మీడియా గురించి చెప్పనక్కర్లేదు. ఒకవైపు అసెంబ్లీ ఎన్నికల్లో పరాభవం, మరోవైపు మాజీ ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు కుమార్తె కవిత అరెస్టు కారణంగా బిఆర్ఎస్ కుదేలైపోయిందనిపిస్తోంది.

టికెట్ల కోసం బారులు తీరకపోవడమే దీనికి నిదర్శనం. తెలంగాణలో కాంగ్రెస్ వ్యవహారం మరోలా ఉంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతోనే అంతర్గత పోరాటాలు మొదలై, వినోదం కలిగిస్తాయని కొంత మంది వాంఛించారు. అలా కాకుండా సాధ్యమైనంత లో కేబినెట్ బృందం సజావుగానే సాగుతోంది. ఇది సగటు కాంగ్రెస్ పోకడకు దూరమైన సంగతే. అదే సమయంలో ఇచ్చిన హామీలను తీర్చేందుకు సతమతమవుతోందనే అభిప్రాయం కలిగింది. అయితే కాంగ్రెస్ పూర్తిగా కుదురుకోకుండానే టిఆర్ఎస్ తీవ్రంగా దాడి మొదలు పెట్టడంతో రాజకీయం నడక పరుగులెత్తింది. తాము ఏమాత్రం ఊహించని రీతిలో పరాజయం మీదబడటంతో చలించిన కెటిఆర్, హరీశ్‌రావు ద్వయం ఇలాంటి వైఖరి తీసుకున్నారని భావించాలి. ఏ కారణమైనా ఆరు నెలల్లో పడిపోతుందనే ప్రచారం పెద్ద ఎత్తున మొదలైంది. ఇది పదేళ్ల తెలంగాణ రాష్ట్ర రాజకీయం లో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం. దాంతో తెలంగాణ మూడు పార్టీల నాయకులు మాటల యుద్ధానికి గేట్లెత్తారు. ఫిరాయింపులకు గేట్లెత్తేశామని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించి మాటల రభసకు సైరన్ మ్రోగించారు.

దాంతో గుంటనక్కలే కాదు సింహాలు కూడా జూలు విదిల్చి వచ్చేస్తాయని మూడు పార్టీల నాయకులు ధ్వనించారు. రేవంత్ రెడ్డికి మరో రెడ్డి జవాబు చెప్పాలనేమో బండి, ఈటల, రఘునందన్ కాకుండా మహేశ్వర రెడ్డి బిజెపి నుంచి మాట్లాడటం మొదలుపెట్టారు. నిజానికి తెలంగాణ రాజకీయ దృశ్యం వంటిది భారతదేశంలో మరొక చోట దొరకదేమో! సమఉజ్జీల్లాగా అనిపించే మూడు పార్టీలు గత పదేళ్లుగా ఒకే రకమైన మాటలు మాట్లాడుతూ, ఒకే రకమైన ఖండనలు చేస్తూ సాగుతున్నాయి. ప్రతి పార్టీ మిగతా రెండింటినీ టార్గెట్ చేస్తూ ఒకదానికొకటి బి టీములని తూలనాడుతున్నాయి. విషయం ఏదైనా వాదన మాత్రం అలాగే ఉంటుంది. టచ్‌లో ఉన్నారంటూ బిఆర్ఎస్ నాయకులు ధ్వనిస్తే, కాంగ్రెస్ అధ్యక్షుడుగా గేట్లు తీస్తామని జవాబు. దానికీ బిజెపి రెండింటిలో తమకు ఆసక్తి, ప్రవేశం ఉన్నట్లు కొనసాగింపు. గేట్లు రంగప్రవేశం చేశాక పడగొట్టడం తగ్గుమొహం పట్టింది. కానీ, ఫిరాయింపుదారులకు రాచబాట లేర్పడ్డాయి. ఇది ఎన్నికల నోటిఫికేషన్ మొదలయ్యే దాకా సాగొచ్చు. కెటిఆర్, హరీశ్ మాత్రమే తొలుత మాటల చిచ్చుబుడ్లు పేల్చారు, కవిత కటకటాల పాలైనా కెసిఆర్ ఉలకలేదు, పలకలేదు. అయితే పెద్ద సారు ఆలస్యంగా వాయింపుడు ప్రారంభించినా డెసీ బెల్స్ బద్దలై మీడియా, సోషల్ మీడియా ఏకకాలంలో పేలిపోయాయి. కరోనా కాలం నుంచి కెసిఆర్ ప్రసంగాలకు మరింత గ్లామర్ పెరిగిపోయి మీడియా రేటింగ్స్ అదిరిపోయేవి, చంద్రబాబు మీద విసుర్లతో సహా! ఇప్పుడు కూడా ఎందుకు ప్రవేశించిందో కానీ నిరోధంతో కూడిన రీతిలో వచోవైభవం.

మరి పదవిలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీనికి తుక్కుగూడ కాంగ్రెస్ మీటింగ్‌లో అంతకు ముందు ప్రణాళికేమిటో తెలియదు కానీ, కెసిఆర్‌పై చెలరేగి ఊగిపోయి శివతాండవం చేసేశారు! దాంతో యూట్యూబ్ వీడియోల నర్తనం హొయలు పోయింది. నిజానికి కెటిఆర్ స్పందించారు కానీ బాగా ఆలస్యంగా! కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ వ్యవహారం, టెలిఫోన్ ట్యాపింగ్ మసాలా, ఎండిపోయిన తెలంగాణ పంటలు లేదా ముందు ముందు మీదబడే ఏ విషయమైనా ఈ వచో కాలుష్యంలో మునిగి తేలాల్సిందేనా? కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కుదుటపడే టైమివ్వక బిఆర్ఎస్ పోరు మొదలు పెట్టి తొందరపడిందా? కాంగ్రెస్ ఈస్థాయిలో గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వం మీద ఎందుకు విమర్శల దాడి చేయలేకపోయింది? తమ పార్టీ పట్ల కనీసం సానుభూతిని కూడా రాకుండా, దాన్ని పూర్తిగా కోల్పోయేలా చేసుకొన్న కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌ల విమర్శల వెల్లువ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులను కలిపి ఉంచుతోందా? ఈ మూడు పార్టీల ముచ్చటైన ఆటలో బిజెపి బాపుకునేదేమిటి? మరి ఈ మొత్తం రచ్చరచ్చ గోలలో సగటు తెలంగాణ పౌరుడికి ఒనగూడేదేమిటి? నిజానికి పౌరసమాజం ఈదిశలో దృష్టి పెట్టి కృషి చేసి మార్గనిర్దేశం చేయాల్సిన అగత్యం ఉంది.

అయితే దౌర్భాగ్యవశాత్తు ఆలోచనపరులు సైతం రాజకీయ పార్టీలు ఏ కారణంతో అయితే ఉచ్చులో పడ్డాయో దాదాపు అలాంటి నేపథ్యంతోనే మిగతా ఉన్నత వర్గాలు సతమతమైపోవడం బాధాకరం. కనుకనే ఈ నిష్క్రియాపరత్వం వెలి వేరుస్తూనే ఉంది. అవసరం లేని నినాదాల, నిందల పర్వాలు అనంతంగా కొనసాగడం. దీనికి ఒక పరిష్కారం తప్పక రావాలి, అయితే ఎలా? పార్టీలు పార్టీలతో సంబంధం ఉన్న మీడియాతో ఎటువంటి బాధరాయణ సంబంధం లేకుండా పౌరసమాజం నడుం కట్టాల్సిన అవసరం ఉంది. నిజానికి ఇలాంటి ప్రయత్నం కర్ణాటక రాష్ట్రంలో పదేళ్ల క్రితం కొంత స్థాయిలో జరిగినట్టు అప్పట్లో వార్తలు వచ్చాయి!

# పోలీసుల ఆధ్వర్యంలో చేపడుతున్న "ఆపరేషన్ చేయూత" కార్యక్రమం

**– నిషేధిత సిపిఐ మావోయిస్ట్ దళ సభ్యుల కుటుంబాలకు కౌన్సిలింగ్ నిర్వహించిన జిల్లా పోలీసులు**

**– జిల్లా పోలీసులు సమక్షంలో నలుగురు మావోయిస్టు దళ సభ్యుల లొంగుబాటు**





భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 12 (తీన్మార్ న్యూస్): శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో చర్ల పోలీస్ స్టేషన్లో నిషేధిత మావోయిస్టు పార్టీ అజ్ఞాత దళాలలో పనిచేస్తున్న వారి కుటుంబ సభ్యులకు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆధ్వర్యంలో ఆపరేషన్ చేయూత ద్వారా కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో నిషేధిత సీపిఐ మావోయిస్టు పార్టీ అజ్ఞాత దళాల్లో పనిచేస్తున్న వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే అమాయక ప్రజలను బలవంతంగా మావోయిస్టు పార్టీలోకి చేర్చుకొని తమ ఉనికి కోసం, స్వార్ధ ప్రయోజనాల కోసం వారిచేత చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేయిస్తూ వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఏజెన్సీ ప్రాంత అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాలను అడ్డుకొని అభివృద్ధి నిరోధకులుగా మావోయిస్టులు వ్యవహరిస్తున్నారని అన్నారు. చిన్న చిన్న సమస్యలు, కారణాల వలన కుటుంబాలను వదిలేసి తెలిసీ తెలియక మావోయిస్టు పార్టీలోకి వెళ్లి చాలామంది అమాయకులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలియజేశారు. వారందరూ తిరిగి జనజీవన స్రవంతిలో కలవడానికి పోలీసు వారు వారి కుటుంబ సభ్యులకు ఈ కార్యక్రమం ద్వారా అన్ని రకాల ప్రోత్సాహాన్ని అందించడం జరుగుతుందని తెలియజేశారు. జిల్లా నుండి నిషేధిత సిపిఐ పార్టీలో పనిచేస్తున్న దళ సభ్యులంతా లొంగిపోయి ప్రభుత్వం నుంచి వారికి అందే అన్ని రకాల ప్రతిఫలాలను పొందవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

ఆపరేషన్ చేయూత కార్యక్రమానికి స్పందించి నలుగురు దళ సభ్యుల లొంగుబాటు

1). చర్ల మండలం బూరుగుపాడుకి చెందిన వంజం దేవా, 2). కరీంనగర్ జిల్లా గన్నేరువరం గ్రామానికి చెందిన కాంపెల్లి రాజ్ కుమార్‌ఏరంజిత్, 3). చతిస్గడ్ సుకుమా జిల్లాకు, జేగురుగొండ మండలం తిమ్మాపూర్ కు చెందిన సోడి గంగాఏఅశోక్ మరియు 4). సుకుమా జిల్లా దోకుపాడు గ్రామానికి చెందిన కల్మ దేవే లు నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలు నచ్చక,మావోయిస్టు పార్టీ అగ్ర నాయకుల వేధింపులు తట్టుకోలేక ఈరోజు పోలీసులు ఎదుట లొంగిపోవడం జరిగిందని తెలిపారు. గతంలో పోలీసులు ఎదుట లొంగిపోయిన మావోయిస్టు దళ సభ్యులకు రివార్డుల అందజేత

ఇటీవల జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయిన నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీకి చెందిన దళసభ్యులైన

1. మడివి కృష్ణ, ఎర్రం పాడు గ్రామం, చర్ల మండలం (04లక్షలు)
2. పూణేం ఆడమయ్య,అడవి రామవరం గ్రామం గుండాల మండలం (లక్ష రూపాయలు)
3. వెట్టి బీమా, పెంటపాడు గ్రామం,చింతగుప్ప,సుకుమా జిల్లా నకు లక్ష రూపాయల నగదును జిల్లా ఎస్పీ చెక్కుల రూపంలో అందజేశారు.

అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న నిషేధిత మావోయిస్టు పార్టీ అజ్ఞాత దళాల్లో పనిచేస్తున్న వారి కుటుంబాలకు నిత్యావసర వస్తువులను అందజేశారు.

**చర్ల పోలీస్ స్టేషన్లో కమాండ్ కంట్రోల్ ను ప్రారభించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్**

మేము సైతం కార్యక్రమంలో భాగంగా చర్ల మండలంలోని వ్యాపారస్తులు మరియు ప్రజలు స్వచ్ఛందంగా తమ తమ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించేందుకు గాను సుమారుగా చర్ల పోలీసు వారికి రూ. 9,50,000/-అందజేశారు. నేరాల నియంత్రణ కొరకు చర్ల మండలంలో మొత్తం 54 సీసి కెమెరాలను ఏర్పాటు చేసి చర్ల పోలీస్ స్టేషన్లో వీటికి సంబంధించిన కమాండ్ కంట్రోల్ ను ఏర్పాటు చేయడమైనది. శుక్రవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ చేతుల మీదుగా ఈ కమాన్ కంట్రోల్ ను ప్రారభించారు. నేరాల నియంత్రణలో భాగంగా తమ వంతు బాధ్యతగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంలో పాత్ర వహించిన చర్ల మండల వ్యాపారస్తులకు, ప్రజలకు ఈ సందర్భంగా ఎస్పీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ టి.సాయి మనోహర్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్, CRPF 51bn అడిషనల్ కమాండెంట్ సునీల్ కుమార్, 141bn CRPF అసిస్టెంట్ కమాండెంట్ రాజ్ కుమార్, చర్ల సిఐ రాజు వర్మ, దుమ్ముగూడెం సీఐ అశోక్ మరియు ఇన్స్పెక్టర్స్ శ్రీనివాస్,రమేష్, అశోక్ రెడ్డి,ముత్యం రమేష్ మరియు ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# భువనగిరి పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి

**– అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కార్యాలయాలలో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలి**

**– ఎస్ఎస్టి, విఎస్టి., వివిటి, అకౌంటింగ్ టీముల పనితీరును పర్యవేక్షించాలి**

**– హోమ్ ఓటింగు విధానంలో ఓటు గోప్యతను కాపాడాలి**

**– భువనగిరి పార్లమెంట్ పరిధి లోని (7) అసెంబ్లీ సెగ్మెంట్ల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల సమావేశంలో జిల్లా కలెక్టర్ సూచనలు**





భువనగిరి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 12(తీన్మార్ న్యూస్): భువనగిరి పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు తీసుకోవలని జిల్లా ఎన్నికల అధికారి, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హనుమంత్ కే. జండగే అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. శుక్రవారం నాడు జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో భువనగిరి, ఆలేరు, జనగాం, తుంగతుర్తి, నకేరేకల్, మునుగోడు, ఇబ్రహీంపట్నం (7) అసెంబ్లీ సెగ్మెంట్ల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో ఆయన సమావేశమై భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం సంబంధించి ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించారు. ఈనెల 18 నుండి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతున్నందున జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాట్లు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, 7 అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందిన అప్డేటెడ్ ఓటర్



జాబితాలతో హెల్ప్ డెస్క్ లో సిద్ధంగా ఉండాలని, ఏడు నియోజకవర్గాలకు సంబంధించిన అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయాలలో కూడా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని, అప్డేటెడ్ ఓటరు జాబితాలతో వివరాలు అందించాలని తెలిపారు. నామినేషన్ కు సంబంధించిన అన్ని ఫారంలపై హెల్ప్ డెస్క్ లో అభ్యర్థులకు సహాయం అందించాలని, పోటీచేసే అభ్యర్థి, ప్రపోజర్ల ఓటుహక్కు ఉన్నది లేనిది చూడడం, నామినేషన్ పత్రాల పూరింపు, జతచేయు పత్రాలపై అవగాహన కల్పించాలన్నారు. స్టాటిస్టికల్ సర్వీవల్ టీములకు కావలసిన వసతులను కల్పించాలని, టీములు నిర్వహించే రిజిస్టర్లు సరిగా మెయింటైన్ చేసేలా పర్యవేక్షించాలని, చెక్ పోస్ట్ లను తరచూ పరిశీలిస్తుండాలని, టీముల షిఫ్ట్ వారి డ్యూటీలను తనిఖీ చేయాలని, సిబ్బందికి ఐడి కార్డులు ఉండాలని సూచించారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు తరచూ అన్ని టీములతో సమావేశమై ఎప్పటికప్పుడు పనితీరు పరిశీలిస్తుండాలని, సీజర్ సంబంధించి వస్తువులు, నగదు స్వాధీనం చేసుకునే విషయంలో ఎన్నికల నిబంధనలను పూర్తిగా అమలు చేయాలని, వీడియో రికార్డింగ్ తప్పనిసరి ఉండాలని సూచించారు. ఎక్స్పెండిచర్ మానిటరింగ్ విషయాలలో పకడ్బందీ పరిశీలన ముఖ్యమని, ప్రజా ప్రాతినిధ్య చట్టం 127-A ప్రకారం అన్ని అనుమతులు తీసుకోవాలని, వీడియో సర్వైవల్ టీమ్స్, వీడియో వీవింగ్ టీమ్స్, అకౌంటింగ్ టీమ్స్ ద్వారా సరైన పర్యవేక్షణ చేయాలని, అన్ని టీముల రిపోర్టులను సకాలంలో రిటర్నింగ్ అధికారికి అందజేయాలని, సభలు, సమావేశాలు, ర్యాలీలకు సంబంధించి సువిధ ద్వారా ఎన్ని అనుమతి ఇచ్చారు, ఇచ్చిన వాటి వివరాలను సరైన విధంగా ఆన్లైన్ నమోదు చేయాలని, పార్లమెంటు అభ్యర్థికి 95 లక్షల లోపు ఖర్చు నిబంధన ఉన్నదని, మొదట వచ్చిన వారికి మొదటగా అనుమతి



ఇవ్వాలని, వారికి ఏ ప్రాంతం ఎంత సమయం అనేది నిర్ధారించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణ మెటీరియల్ పై స్పష్టమైన అవగాహన ఉండాలని, రికార్డుల ప్రకారం పూర్తిపేరు మెటీరియల్ పొందాలని సూచించారు. ఫామ్ 6, 7, 8 దరఖాస్తులు పెండింగ్ లేకుండా పరిష్కరించాలని సూచించారు. ఈవీఎం యంత్రాల కోసం స్ట్రాంగ్ రూములు ఏర్పాటు చేసుకోవాలని, ఫైర్ ప్రూఫ్ తదితర భద్రతా చర్యలు పఠిష్టంగా చేపట్టాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లలో అన్ని ఏర్పాట్లు చేయాలని, అందుకు కావాల్సిన శిక్షణ, అవగాహన అందించాలని తెలిపారు. వాహనాలు, వీడియో గ్రాఫర్స్, వాలంటీర్లను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. క్రిటికల్ పోలింగ్



స్టేషన్లు సంబంధించి వెబ్ కాస్టింగ్ నిబంధనల ప్రకారం ఏర్పాటు చేయాలని, పోలింగ్ స్టేషన్లలో అన్ని వసతులు తప్పనిసరిగా ఉండాలని, వృద్ధులకు, దివ్యాంగులకు ప్రత్యేక సదుపాయం కల్పించాలని తెలిపారు. అత్యవసర విభాగాల సిబ్బందికి పోస్టల్ బాలట్, 85 సంవత్సరాల వయస్సు దాటిన సీనియర్ సిటీజన్లు, దివ్యాంగులకు హోమ్ ఓటింగ్ సౌకర్యం నిబంధనల ప్రకారం నిర్వహించాలని, హోమ్ ఓటింగ్ సౌకర్యం కల్పించిన వారికి ముందుగానే ఏ రోజు ఏ సమయానికి వస్తున్నది తెలుపాలని, నిబంధనల ప్రకారం హు ఓటింగ్ నిర్వహించాలని, ఓటు గోప్యత చాలా ముఖ్యమని, అవసరమైన పోలీస్ ఎస్కార్ట్ ను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనగాం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు

# బీబీ పాటిల్ నిస్వార్థ పేరులు పేరోపకారులు

**– దేశం కోసం మోదీ జహీరాబాద్ కోసం బీబీ పాటిల్**

**– శ్రీశైలం మఠాధిపతి జగద్గురు**





టేక్మాల్, ఏప్రిల్ 12(తీన్మార్ న్యూస్): ఆందోల్ నియోజకవర్గం టేక్మాల్ మండలం, పాల్వంచ గ్రామంలో శుక్రవారం శ్రీ కేతకి సంగమేశ్వర స్వామికి సహస్ర కుంభాభిషేకం, మహామంగళ హారతి, జగద్గురు పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశైలం మఠాధిపతి జగద్గురు మాట్లాడుతూ బీబీ పాటిల్ ఈ మహత్కార్యం లో సాధారణ పౌరులను కూడా అభిషేకంలో భాగస్వామ్యం చేసి ఆ భగవంతుడి కృప కటాక్షాలు కేవలం తనకే కాకుండా అందరూ పొందే విధంగా అవకాశం ఇవ్వడం గొప్ప విషయం అని అన్నారు. నరేంద్రమోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత దేశాన్ని ఒక్కటి చేయడానికి, ధర్మాన్ని కాపాడటానికి రాత్రింబవళ్ళు కృషి చేస్తున్నారని అటువంటి ప్రధాని వెంట ఉండి వారిని బలపరచడం మనందరి కర్తవ్యం అని తెలిపారు. దేశం కోసం మోదీ పని చేస్తుండగా జహీరాబాద్ అభివృద్ధి కి బీబీ పాటిల్ నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆ పరమేశ్వరుని క్రృపతో బీబీ పాటిల్ మూడోసారి భారీ మెజారిటీతో గెలుస్తారని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపి బీబీ పాటిల్, ఎంబి పాటిల్, అభిషేక్ పాటిల్, శివాచార్య స్వాములు మండల అధ్యక్షుడు నవీన్, మండల ప్రధాన కార్యదర్శి కుమ్మరి సిద్ధిరాములు ఉపాధ్యక్షులు వడ్డె రాములు, జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు మల్లిక,జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్లుపేట రాజు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# పాలకవీడు పీఎస్ లో ఎన్నికల నియమావళి ఉల్లంఘన చేసిన కానిస్టేబుల్

**- కానిస్టేబుల్ విష్ణు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు**
**- జారీ చేసిన జిల్లా ఎస్పి రాహుల్ హెగ్డే**
**- ఎన్నికల వేళ ప్రజాప్రతినిధి పుట్టినరోజు వేడుకలకు హాజరైనందుకే కారణం**





సస్పెండ్ కి గురైన కానిస్టేబుల్

పాలకవీడు, ఏప్రిల్ 12(తీన్మార్ న్యూస్): పాలకవీడు పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ విష్ణు రెండు రోజులు క్రితం నేరెడుచర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొన్నతం చిన్న వెంకటరెడ్డి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్నారనే నైపద్యంలో సస్పెండ్ చేసినట్టుగా సమాచారం వేడుకల్లో పాల్గొన్న ఫోటో వైరల్ కావడంతో పై అధికారులు చర్యలు తీసుకున్నట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో ప్రజాప్రతినిధుల విందుల కి వినోదాలకి హాజరు కాకూడదు అనే నిబంధనని ఉల్లంఘించారని అందుకే సస్పెండ్ చేసినట్టుగా పై అధికారులు తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముఖ్యులు

హుజురాబాద్, ఏప్రిల్ 12 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు కాంగ్రెస్ పార్టీ తీర్థం తీసుకున్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జి వొడితల ప్రణవ్ సమక్షంలో బీఆర్ఎస్ నేత, హుజురాబాద్ మున్సిపల్ మాజీ చైర్మన్ వడ్లూరి విజయ్ కుమార్, బిఆర్ఎస్ నాయకులు, మాజీ కౌన్సిలర్ కొయ్యడ శ్రీదేవి-కమలాకర్, బీఆర్ఎస్ నాయకులు పంజాల సతీష్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిని ప్రణవ్ పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. కరీంనగర్ గడ్డపై వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో హుజురాబాద్ నియోజకవర్గం నుండి అత్యధిక మెజార్టీ ఇచ్చేందుకు కీలకంగా పనిచేయాలని వారికి ప్రణవ్ సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొల్లూరి కిరణ్ కుమార్ తౌటం రవీందర్ యండి అఫ్సర్ సొల్లు బాబు, కౌర్ సుగుణాకర్ రెడ్డి, నేరేళ్ల మహేందర్, దేశిని కోఠి, దేశిని ఐలయ్య, సందమల్ల బాబు, సొల్లు



దశరథం, బిఆర్ గౌడ్, సందమల్ల నరేష్, మేకల తిరుపతి, మిడిదొడ్డి రాజు, వల్గు తిరుపతి, గంట కిరణ్ రెడ్డి, ఉప్పరి చందు, టేకుల శ్రావణ్, బండ నవీన్, ముక్క రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

# బసవేశ్వర విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న మర్రి నిరంజన్ రెడ్డి




ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 12(తీన్మార్ న్యూస్): ఇబ్రహీంపట్నం నియోజకవర్గం, మంచాల మండల కేంద్రంలో శుక్రవారం రోజు వీరశైవలింగాయత్, లింగబలిజ సంఘం ఆధ్వర్యంలో మహాత్మ బసవేశ్వర విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ యొక్క కార్యక్రమంలో ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. అనంతరం మంచాలలో నిర్వహించిన బారీ ర్యాలి, అన్నప్రసాద కార్యక్రమం, సన్మాన సభ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మర్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతు 12వ శతాబ్దంలోనే కులరహిత సమాజం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి బసవేశ్వరుడని కొనియాడారు. సమసమాజ స్థాపన కోసం దేవుడిని భక్తుడి వద్దకు తీసుకువచ్చే ఇష్టలింగ పూజా కార్యక్రమాన్ని ఆయన తీసుకువచ్చారని తెలిపారు. బసవేశ్వరుడి బోధనలు నేటి సమాజానికి ఎంతో అవసరమన్నారు. సమాజంలో స్త్రీ, పురుషుల మధ్య లింగ విభేదాలు తొలిగించడానికి కృషి చేసిన గొప్ప అభ్యుదయవాది అన్నారు. సర్వ మానవ సమానత్వమే శాంతికి మూలమని ఉపదేశించారన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో ముఖ్య నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, బిఎన్ జ్ఞానేశ్వర్, నరేందర్ రెడ్డి, జెనిగె వెంకటేష్ యాదవ్, మంచాల మండల బసవేశ్వర సంఘం నాయకులు, సభ్యులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# జిల్లాలో 323 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

**- కొనుగోలు ప్రారంభించినట్టు తెలిపిన అదనపు కలెక్టర్**

భువనగిరి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 12(తీన్మార్ న్యూస్): జిల్లాలో 323 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోళ్లు చేపట్టినట్లు జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్ షా లోమ్ నేడొక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నాడు ఆయన యాసంగి వరి ధాన్యం కొనుగోళ్ళను వివరిస్తూ 85 ఐకేపి కేంద్రాలు, 225 పాక్స్ కేంద్రాలు, 13ఎఫ్పివో ల ద్వారా కొనుగోళ్లు చేయడం జరుగుతున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 32 కేంద్రాల ద్వారా 168 మంది రైతుల నుండి 29 కోట్ల విలువ చేసే 1330 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో అవసరమైన గన్ని సంచులు, టార్పాలిన్లు ఉన్నాయని, రైతులు నాణ్యతా ప్రమాణాలతో కూడిన ధాన్యాన్ని కేంద్రాలకు తేవాలని ఈ సందర్భంగా కోరారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని



మిల్లులకు సకాలంలో రవాణా చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు, కొనుగోలు అనంతరం రైతుల ఖాతాలలో సకాలంలో డబ్బులు జమ చేయడానికి అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

# గ్రామపంచాయతీ కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలి

**- సిఐటియు మండల కన్వీనర్ పోచమోని కృష్ణ**
**- 2వ రోజుకు చేరిన గ్రామ పంచాయతీ సిబ్బంది సమ్మె**

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 12(తీన్మార్ న్యూస్): రంగారెడ్డి జిల్లా, మంచాల మండలం, లోయపల్లి గ్రామం లో గ్రామపంచాయతీ కార్మికులు తమకు రావాల్సిన 6నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని లోయపల్లి గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న నిరసన కార్యక్రమం 2వ రోజుకు చేరింది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ పోచమోని కృష్ణ మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు నెలనెలా అందక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లోయపల్లీ జీపీ కార్మికులకు 6 నెలలుగా వేతనాలు రావాలని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో వేతనాలు చెల్లించకపోతే లోయపల్లీ నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహిస్తామని తెలిపారు. మండలంలో ఇంకా అనేక గ్రామాల కార్మికులకు పెండింగ్ వేతనాలు రావాల్సి ఉందని అన్నారు. వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించకపోతే మండల వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. వేతనాలు అందక ఎంతిని పనిచేయాలని

గ్రామపంచాయతీ కార్మికులు ప్రశ్నిస్తుంటే అధికారులు మాత్రం



నిమ్మకు నీరు ఎత్తినట్టుగా వ్యవరించడం సరైనది కాదని అన్నారు. అధికారులు ప్రతినెలనెలా 5వ తేదీలోపు వేతనాలు తీసుకోవడం లేదా అని ప్రశ్నించారు. గ్రామ పంచాయతీల్లో ఉన్ననిధులన్ని కాంట్రాక్టర్లకు ఇచ్చేసి గ్రామపంచాయతీ కార్మికులను మాత్రం ఆకలికి చంపుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులు కృష్ణ, హిరలాల్, ఎ.రవి, డి.కుమార్, సాలమ్మ, పి.రమేష్, లచ్చు, రాములమ్మ, సత్తయ్య, సరిత, ఆగమ్మ, వనజ, తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుల స్ఫూర్తిని చాటి చెప్పడమే మా లక్ష్యం

**- పుట్ట మధుకర్**

**ముంబైలోని రాజగృహను సందర్శించిన జెడ్పి చైర్మన్**

పెద్దపల్లి, ఏప్రిల్ 12 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ రాజీవ్ గాంధీ ఎయిర్పోర్ట్ నుండి మహనీయుల స్ఫూర్తి దీక్షలో భాగంగా మహారాష్ట్ర రాష్ట్రం ముంబైలోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నివాసమైన రాజగృహ సందర్శనకు బయలుదేరిన ఆయన రాజగృహతోపాటు అంబేద్కర్ సమాధి (చైత్య భూమి) ని తగరం శంకర్ లాల్ తో సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది క్రితం మహనీయుల మాస ఉత్సవాల సందర్భంగా అనేకమంది మహనీయుల పుణ్యస్థలాలు జన్మస్థలాలు సందర్శించి వారి చరిత్రను తెలుసుకోవడం జరిగిందన్నారు మహనీయుల చరిత్ర తెలుసుకుంటేనే బాగుపడతామని ఆయన అన్నారు. ఇప్పటికే జ్యోతిరావు పూలే, కొమురం భీం, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, చాకలి ఐలమ్మ లాంటి మహనీయుల జన్మస్థలాలు పుణ్యస్థలాలు సందర్శించామని వారి



చరిత్రను నియోజకవర్గ ప్రజలకు చాటి చెప్పామన్నారు అయితే మహనీయుల చరిత్ర తెలుసుకోకపోతే చరిత్రహీనులుగా మిగిలిపోతామని బానిస బతుకులే దక్కుతాయని ఆయన అన్నారు.

# బిజెపి ఎస్టిమోర్చా జిల్లా అధ్యక్షునిగా కేతావత్ రవి నాయక్ నియామకం

పెబ్బేరు, ఏప్రిల్ 12(తీన్మార్ న్యూస్): భారతీయ జనతా పార్టీ ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షునిగా కేతావత్ రవి నాయక్ శుక్రవారం నాడు వనపర్తి జిల్లా బిజెపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు దుప్పల్లి నారాయణ చేతుల మీదుగా నియామక పత్రమును అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ వనపర్తి జిల్లాలోని గిరిజన ప్రజల యొక్క ఇబ్బందులను వారి అభివృద్ధి కొరకై పనిచేయాలని అదేవిధంగా భారతీయ జనతా పార్టీ నాగర్ కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్ గెలుపు కొరకు పనిచేసి మూడవసారి నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా పని చేసే దిశగా




అడుగులు వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఎవరెన్ని కుట్రలు చేసినా కాంగ్రెస్ అభ్యర్థి కావ్య విజయం సాధిస్తుంది

**- మందకృష్ణ నాపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారు: ఎమ్మెల్యే కడియం**

జనగామ, ఏప్రిల్ 12 (తీన్మార్ న్యూస్): ఎవరు ఎన్ని కుట్రలు, కుయుక్తులు చేసినా వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కావ్య విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి చెప్పారు. తమకు బీఆర్ఎస్ పార్టీ డబ్బులు ఇచ్చినట్టు నిరూపిస్తే తాము ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకుంటామని



సవాల్ విసిరారు. కాగా, కడియం స్టేషన్ ఘన్‌పూర్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ నుంచి మేము రూ.10కోట్లు తీసుకున్నామని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఇది నిజమని ఎలాంటి ఆధారాలు చూపించినా, నిరూపించినా మేము ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకుంటాము. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా కావ్య గెలుపు ఖాయమైంది. సీఎం రేవంత్ ఆశీర్వాదంతో నేను వరంగల్‌ను అభివృద్ధి చేస్తాను. బీజేపీ వాళ్ళు రాజ్యాంగం మీద అవగాహన లేక మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారు. చేసిన పని చెప్పడానికి ఏమీ లేక వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారు. నా కూతురు కావ్య ఇక్కడే పుట్టింది, ఇక్కడే కడియం ఫౌండేషన్ అనేక సేవా కార్యక్రమలు చేసింది. 2017లో ఐదుగురు జడ్జిల ధర్మసానం భారతదేశంలో మతం మారినంత మాత్రాన కులం మారదు అని తెలిపింది. పిల్లలకు తండ్రి కులం వర్తిస్తుంది. కావాలని ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ఇలాంటి వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నాను. నా 30ఏళ్ల రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం. నా నిజాయితే నాకు పెట్టుబడి. నేను ఏ పార్టీకి వెన్ను పోటు పొడవలేదు. కానీ నా ద్వారా ఎదిగిన ఆరూరి రమేష్ నాకు వెన్నుపోటు పొడిచాడు. నేను ఛాలెంజ్ చేస్తున్న నీదగ్గర ఏమైనా డబ్బులు తీసుకున్నానా చెప్పాలి. 2014, 2018లో నీ గెలుపు కోసం నేను ప్రచారం చేసాను. నువ్వు చేసిన భూకబ్జాల కారణంగా ఓడిపోయావు. ఓటమి భయంతో ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారు. మందకృష్ణ నాపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారు. ఒక్క నాపై మాత్రమే ఎందుకు విమర్శలు చేస్తున్నావు. నాది మాదిగ ఉప కులం. మాదిగలకు ద్రోహం చేస్తున్నది మందకృష్ణ. బీజేపీ మళ్ళీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తాం అంటున్నా పార్టీకి ఓటు వేయమని ఎలా చెపుతున్నావు. దీనికి సమాధానం చెప్పాలి. నీ నాయకత్వం సరిగా లేకపోవడం వల్లనే ఎంఆర్పీఎస్‌లో చీలికలు వచ్చాయి అంటూ విమర్శలు చేశారు.

# మాదిగ హక్కుల దండోరా హన్మకొండ జిల్లా అధ్యక్షుని ఎన్నిక

**- సింగారపు దిలీప్ కుమార్ మాదిగ నియామిస్తూ ఉత్తర్వులు**

హన్మకొండ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 12(తీన్మార్ న్యూస్): జిల్లా కేంద్రంలో జరిగిన మాదిగ హక్కుల దండోరా సమావేశం లో 11 వ డివిజన్ రంగంపేట ప్రాంతానికి చెందిన సింగారపు దిలీప్ కుమార్ ను హన్మకొండ జిల్లా అధ్యక్షునిగా నియామకం చేస్తూ మాదిగ హక్కుల దండోరా ఉమ్మడి వరంగల్ జిల్లా



అధ్యక్షులు గనిపాక ప్రదీప్ మాదిగ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రదీప్ దిలీప్ కు నియామక పత్రం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మాదిగ హక్కుల కోసం ఆత్మగౌరవం కోసం అభివృద్ధి కోసం నిస్వార్ధంగా పోరాడాలని పిలుపునిచ్చారు. నియామకానికి సహకరించిన ప్రదీప్ కు దిలీప్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో మాదిగ హక్కుల దండోరా వరంగల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గనిపాక కిషోర్ మాదిగ, భాస్కర్ మాదిగ, చరణ్ మాదిగ, రాజు మాదిగ, జిల్లా కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ



ఆత్మకూర్, ఏప్రిల్ 12(తీన్మార్ న్యూస్): ఆత్మకూరు మండలం, మూలమల్ల గ్రామంస్లో శుక్రవారం రోజు మహాత్మా గాంధీ ఉపాధి హామీ కూలీలకు మూలమల గ్రామ గ్రామీణ ప్రథమ చికిత్స వైద్యులు వెంకటేష్ చారి ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం ప్రథమ చికిత్స వైద్యులు మాట్లాడుతూ ఎండాకాలం దృష్ట్యా ఉపాధి హామీ కూలీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ అరుణమ్మ గ్రామ పెద్దలునారాయణరెడ్డి, నరసింహారెడ్డి, ఎల్లప్ప, కృష్ణయ్య, కురుమూర్తి ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# తాడూరు లో పిడుగుపాటుకు మహిళా మృతి



అచ్చంపేట ప్రతినిధి, ఏప్రిల్ 12(తీన్మార్ న్యూస్): ఉప్పునుంతల మండలంలోని తాడూరు గ్రామం చెందిన గున్నమోని శ్యామల (35) అనే మహిళ శుక్రవారం మధ్యాహ్నం పిడుగుపాటుకు గురై మృతి చెందారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం రోజువారీగా వ్యవసాయ పొలానికి వెళ్లారు. మధ్యాహ్నం అనుకోకుండా ఒక్కసారిగా గాలి దుమారం లేచి వర్షం కురుస్తుండడంతో తలదాచుకోవడానికి తన వ్యవసాయ పొలంలో ఉన్న వేప చెట్టు కింద కూర్చొని ఉండగా ఆకస్మాత్తుగా పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలు భర్త పర్వతాలతో పాటు ముగ్గురు కుమారులు ఉన్నట్లు గ్రామస్తులు వివరించారు.

# బీరప్ప పండుగకురావాలని కేటీఆర్ కు ఆహ్వానం



రాజాపేట, ఏప్రిల్ 12(తీన్మార్ న్యూస్): రాజపేట మండలం, దూది వెంకటాపురం గ్రామంలో జరగబోయే కురుమలకు ఇలవేల్పైన శ్రీ బీరప్ప కళ్యాణం మహోత్సవం ఆహ్వాన పత్రికను మాజీ మంత్రి కేటీఆర్ కు శుక్రవారం నక్కిర్త కనకరాజు, పల్లె సంతోష్ గౌడ్, తుంగ బాలు కలసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దూది వెంకటపురంలో జరగబోయే బీరప్ప కళ్యాణ మహోత్సవం కు టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారన్నారు.

# నూతన వదువరులను ఆశీర్వధించిన అయ్యోరి యణయ్య



మంగపేట, ఏప్రిల్ 12 (తీన్మార్ న్యూస్): శుక్రవారం మంగపేట మండల తిమ్మాపూర్ (తాక్కేలగూడెం ) ధోమడా పలు గ్రామలలో శు భ కార్యక్రమలకు ముఖ్య అతిధిగా హాజరై నూతన వదు వరులను ఆశీర్వధించిన జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యణయ్య ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు కొమరం రామకృష్ణ, సప్పిడి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు మహుమాద్ ఆశీ, కొమరం సారయ్య, బాలన్న, కేశవరావ్, బాబురావు, సోయం అచ్చయ్య,గద్దల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# బిసి యువజన సంఘం మండల అధ్యక్షుడిగా మంగ కృష్ణ నియామకం



రాజాపేట, ఏప్రిల్ 12(తీన్మార్ న్యూస్):బిసి ఉద్యమాన్ని గ్రామీణ స్థాయి నుండి బలోపేతం చేయడం కోసం బీసీ యువజన సంఘం మండల అధ్యక్షుడిగా దూది వెంకటాపురం గ్రామానికి చెందిన మంగ కృష్ణ ను నియమిస్తూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్ కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. అందుకు సంబంధించిన నియామక పత్రాన్ని శుక్రవారం రాజపేట మండల కేంద్రంలో అందజేసారు. ఈ సందర్భంగా నూతనంగా నియమించబడ్డ బిసి యువజన సంఘం మండల అధ్యక్షుడు మంగ కృష్ణ మాట్లాడుతూ బీసీల సమగ్ర అభివృద్ధి కోసం గత రెండు దశాబ్దాలుగా నిర్విరామంగా పోరాటం చేస్తున్న బీసీ నేత జూకంటి ప్రవీణ్ కుమార్ తనపై నమ్మకంతో ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానన్నారు. అదేవిధంగా బీసీలకు జనాభా దామాషా ప్రకారం సమస్త రంగాల్లో సమానమైన వాటా దక్కాలని జరిగే సామాజిక న్యాయ పోరాటానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

# అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

## ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మంద నరేష్



హనుమకొండ, ఏప్రిల్ 12 (తీన్మార్ న్యూస్): కాకతీయ యూనివర్సిటీలో ఏబీఎస్ఏఫ్ కెయూ అధ్యక్షులు మచ్చ పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో సమావేశం జరుగగా ముఖ్యదితిగా ఏబీఎసఎస్ఫ్ జిల్లా అధ్యక్షులు మంద నరేష్ హాజరై మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత ప్రపంచం మేధావి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని ఈ నెల 14న అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని మంద నరేష్ అన్నారు అంబేద్కర్ జయంతి సందర్బంగా కాకతీయ యూనివర్సిటీలో ఈనెల 14న సాయంత్రం భారీ ర్యాలీని ఏబీఎస్ఏఫ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందనీ మంద నరేష్ అన్నారు విద్యార్థుల అధిక సంఖ్యలో హాజరై అంబేద్కర్ జయంతి ర్యాలీని విజయవంతం చేయాలని మంద నరేష్ విద్యార్థులను కోరారు. ఈ సమావేశంలో ఏబీఎస్ఏఫ్ కెయు వర్కింగ్ ప్రెసిడెంట్ ధార సురేష్ కెయు నాయకులు దూడపాక నరేందర్ వివేక్ అరిస్టాటిల్ రత్నాకర్ కిరణ్ వెంకటేష్ సాయి సురేష్ క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# పటేల్ యూత్ గర్జన సభను విజయవంతం చేయాలి

## జర్నలిస్ట్ ఫోరం జిల్లా అధ్యక్షులు పిట్టల మధుసూదన్ పటేల్



ములుగు, ఏప్రిల్ 12 (తీన్మార్ న్యూస్): ఈనెల 14న (ఆదివారం) కరీంనగర్ లో జరిగే పటేల్ యూత్ గర్జన సభ విజయవంతం చేయాలని మున్నూరుకాపు జర్నలిస్ట్ ఫోరం ములుగు జిల్లా అధ్యక్షులు పిట్టల మధుసూదన్ పటేల్ శుక్రవారం కోరారు. పటేల్ యూత్ గర్జన సభలో పలు అంశాలపై చర్చ అనంతరం పటేల్ గెజిట్ కోసం గ్రామస్థాయి నుండి, మండలం, డివిజన్, జిల్లా, ప్రెస్ అప్ గవర్నమెంట్ వరకు గెజిట్ కోసం కావలసిన, పత్రాలు, వాటి పూర్తి వివరాలు కూలంకుశంగా చర్చ ఉంటుందన్నారు. ఇకనుండి ప్రతి మున్నూరు కాపు కులస్తులకు పటేల్ పేరు తప్పనిసరిగా గెజిట్ తీసుకొస్తామని, అలాగే వివిధ గ్రామాల నుండి హైదరాబాద్ వరకు వెళ్లి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు వేరువేరుగా వెయ్యి మంది తో కూడిన బాలికల హాస్టల్ వసతి గృహం ఏర్పాటు కు తీర్మానం చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని మున్నూరుకాపు యువకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# కార్పొరేట్ వ్యవసాయానికి వ్యతిరేకంగా ఉద్యమాలు

## – రైతు సమస్యలపై ఏఐకేఎస్ అనేక పోరాటాలు

## : మిర్యాలగూడ సభలో జూలకంటి



ఖమ్మం: స్వాతంత్ర్యం రాక ముందు బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా రైతులంతా సంఘటితమై ఆలిండియా కిసాన్ సభ (ఏఐకేఎస్) పేరుతో ఏర్పడిన సంఘం రైతు సంఘం అని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ తెలిపారు. ఏఐకేఎస్ 89వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో జెండా ఆవిష్కరణలు, సభలు నిర్వహించారు. ఖమ్మంలోని జిల్లా ప్రజా సంఘాల కార్యాలయం సుందరయ్య భవన్‌లో రైతు సంఘం జెండాను పోతినేని ఆవిష్కరించారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. పేద రైతులు, కౌలు రైతుల విముక్తి కోసం ఒక సంఘం కావాలని, అలా దేశంలో 1936లో ఏర్పడిన అఖిల భారత కిసాన్ సంఘ్ రైతాంగ సమస్యలపై దేశ వ్యాప్తంగా అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించిందన్నారు. రైతు సంఘం ఏర్పడిన మొట్టమొదటి సారి ఆనాడు ఉమ్మడి రాష్ట్రంలోని ఇచ్ఛాపురం నుంచి తడా వరకు బ్రహ్మాండమైన రైతు యాత్ర నిర్వహించి, దేశ వ్యాప్తంగా రైతు ఉద్యమాలకు శ్రీకారం చుట్టినట్టు గుర్తుచేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దుర్మార్గంగా తీసుకువచ్చిన 3 నల్లచట్టాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున జరిగిన రైతు పోరాటాల్లో ఏఐకేఎస్ కీలక పాత్ర పోషించిందన్నారు. రైతుల పోరాటాలకు తలొగ్గి మోడీ ప్రభుత్వం నల్ల చట్టాలను రద్దు చేసిందని, మళ్ళీ వాటిని అమలు చేయడం కోసం దొడ్డిదారిన ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రైతులకు ఇచ్చే వ్యవసాయం సబ్సిడీల మీద కోత పెడుతుందని, ఉపాధి హామీ చట్టాన్ని కూడా నీరుగారుస్తుందని, ఎరువు, విత్తనాలకు ఇచ్చే సబ్సిడీల మీద కోతలు పెడుతూ రైతులను అనేక ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. పంటకు కనీస మద్దతు ధర కల్పించకుండా, మార్కెట్‌లను ఎత్తివేయాలని ప్రయత్నం చేస్తుందని, వీటన్నింటికి వ్యతిరేకంగా పెద్దఎత్తున రైతులు పోరాటాలు చేయాలని, ఇప్పటి వరకు సాధించుకున్న చట్టాలను, హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతు సంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. అఖిల భారత కిసాన్ సభకు ఎంతో చారిత్రాత్మక చరిత్ర ఉందన్నారు. జాతీయోద్యమంలో బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, రైతాంగాన్ని సమీకరించి, దున్నేవాడికి భూమి కావాలనే లక్ష్యంతో రైతు ఉద్యమం నిర్వహించి దాదాపు కోట్లాది ఎకరాల భూమి సాధించుకున్న చరిత్ర ఏఐకేఎస్‌కు ఉందన్నారు. భారత దేశంలో భూములను కార్పొరేట్ శక్తులు కబలించే కుట్రలకు వ్యతిరేకంగా పోరాడే సంఘం ఏఐకేఎస్ అని తెలిపారు.

భవిష్యత్‌లో జరిగే రైతు ఉద్యమాలకు రైతులంతా ఐక్యంగా సంఘటితమై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు వాసిరెడ్డి వరప్రసాద్, సీఐటీయూ జిల్లా నాయకులు కళ్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, వ్యకాస జిల్లా నాయకులు మెరుగు సత్యనారాయణ, యర్రా శ్రీనివాసరావు, ఆర్.ప్రకాష్, బోడపట్ల సుదర్శన్, పొన్నెకంటి సంగయ్య, ప్రతాపనేని వెంకటేశ్వరరావు, ఐద్వా నాయకులు మెరుగు రమణ, కేవీపీఎస్ నాయకులు నందిపాటి మనోహర్, పగడాల నాగేశ్వరరావు, నెల్లూరి వీరబాబు తదితరులు పాల్గొన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణకేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఆ సంఘం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యానికి ముందు జరిగిన రైతాంగ పోరాటం నేటికి స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. భూస్వాములకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు జరిపారని, ఆ పోరాటంలో 80 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. నాటి నుంచి నేటి వరకు రైతన్న సమస్యలపై సంఘం అనేక పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. నల్లగొండ జిల్లాకేంద్రంలోని డాక్టర్స్ కాలనీలో సిద్ధార్థ్ కాలేజీ వద్ద రైతు సంఘం జెండాను ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కూన్‌రెడ్డి నాగిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బండ శ్రీశైలం ఆవిష్కరించారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్‌లో సంఘం జెండాను తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జున రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేటలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో రైతు సంఘం జెండాను ఆ సంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్‌రెడ్డి ఆవిష్కరించారు.

# న్యాయమూర్తి మండాను మర్యాదపూర్వకంగా కలిసిన సిటీ స్టైల్ జిమ్ కోచ్



భద్రాచలం, ఏప్రిల్ 12 (తీన్మార్ న్యూస్): భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ కోచ్ జివి రామిరెడ్డి శుక్రవారం ఉదయం తెలంగాణ దేవాదాయ శాఖ ట్రిబ్యునల్ న్యాయమూర్తి మండా వెంకటేశ్వరరావుని భద్రాచలంలోని వారి నివాసంలో పుష్పగుచ్ఛం ఇచ్చి మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.

న్యాయమూర్తి మండా వెంకటేశ్వరరావు భద్రాచలంలో ఎవరికి పరిచయం అవసరం లేని సుపరిచిత వ్యక్తి అని అంతేకాకుండా ఆయనకు చిన్నతనం నుంచి కూడా చదువు పట్ల ఎక్కువ శ్రద్ధ ఉండేది. ఎంతో కష్టపడి చదువుకొని న్యాయమూర్తిగా ఎదిగినందుకు భద్రాచల వాసులందరూఎంతగానో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కోట సురేష్ ని పరామర్శించిన జడ్పీ చైర్మన్ బడే నాగజ్యోతి



తాడ్వాయి, ఏప్రిల్ 12 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా తాడ్వాయి మండల బిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు కోట సురేష్ ను హనుమకొండలో శ్రీనివాస కిడ్నీ ఆసుపత్రిలో కిడ్నీకి సంబంధించిన సర్జరీ అవ్వగా విషయం తెలుసుకున్న జెడ్పి ములుగు చైర్మన్ బడే నాగజ్యోతి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. సంబంధించిన డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఆమె వెంట కార్యకర్తలు నాయకులు తదితరులు ఉన్నారు.

# మృతుని కుటుంబానికి బియ్యం సాయం చేసిన ముడవత్ రాంజీ నాయక్ చౌహాన్



రాజాపేట, ఏప్రిల్ 12(తీన్మార్ న్యూస్): ఇటీవల కాలంలో మలోతు లాలు నాయక్ అనారోగ్యంతో మరణించగా ఆ కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ తన వంతు సాయం గా 50కేజీ ల బియ్యం జిల్లా కాంగ్రెస్ నాయకులు మూడవత్ రాంజీ నాయక్ చౌహన్ అందించారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్ద మనషి లాచ్చ నాయక్, ఎఎంసి డైరెక్టర్ విఠల్ నాయక్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు మాన్య నాయక్, ఎన్ఎస్యుఐ జిల్లా కార్యదర్శి రవీందర్ చౌహాన్, జిల్లా నాయకులు రమేష్ నాయక్, మండల నాయకులు జిల్య నాయక్, దేవదాసు నాయక్, పత్తి నాయక్, గ్రామా యూత్ నవీన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ వడ్డీ వ్యాపారస్తులపై పోలీసుల దాడి




భూపాలపల్లి, ఏప్రిల్ 12 (తీన్మార్ న్యూస్): భూపాలపల్లి, కాటారం, మహాదేవ్ పూర్ లో పలు అక్రమ వడ్డీ, వ్యాపారుల ఇల్లు, కార్యాలయాలపై భూపాలపల్లి, కాటారం డిఎస్పీల ఆధ్వర్యంలో 12 బృందాలతో పోలీసులు దాడులు నిర్వహించారు. 193 ప్రామిసరీ నోట్లు, 93 ఏటీఎం కార్డులు, 61 ఖాళీ చెక్కులు, 28 బ్యాంకు పాసు బుక్కులు, 109 బ్యాంకు చెక్కులు, 13 బాండ్ పేపర్లు, 11 పట్టా పాస్ బుక్కులు, రూ. 3, 71 240 స్వాధీనం చేసుకొని, 12 మందిపై కేసు పెట్టినట్లు పోలీసులు తెలిపారు.

# ఓటు హక్కు ప్రాముఖ్యత గురించి అవగాహన



ఆత్మకూర్, ఏప్రిల్ 12(తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ ఆదేశానుసారం వనపర్తి డిపిఆర్ఓ అధికారి సీతారాం ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతి సారధి కళాకారుల బృందం చే వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం మూలమల్ల గ్రామంలో ఓటు హక్కు ప్రాముఖ్యత గురించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వేసవి కాలం దృష్ట్యా తీసుకోవలసిన తగు జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారుల బృందం రాధా సువర్ణ కృష్ణయ్య, శ్రీనివాసులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# పరకాల అసెంబ్లీ ఎస్టీ మోర్చా ఇంచార్జ్ గా పాలకుర్తి తిరుపతి



పరకాల, ఏప్రిల్ 12 (తీన్మార్ న్యూస్): వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పరకాల అసెంబ్లీ ఎస్టీ మోర్చా ఇంచార్జ్ గా శుక్రవారం పాలకుర్తి తిరుపతిని బిజెపి రాష్ట్ర ఆధ్యక్షులు జి కిషన్ నియమించడం జరిగింది. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ నాపై నమ్మకంతో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా భారతీయత పార్టీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లో తీసుకెళ్లడానికి పరకాల అసెంబ్లీ ఎస్టి మోర్చా ఇంచార్జ్ గా బాధ్యతలు అప్పగించిన బిజెపి రాష్ట్ర ఆధ్యక్షులు జి కిషన్ రెడ్డి మరియు ఎస్టి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కళ్యాణ్ నాయక్, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజరాల ప్రేమేందర్, బిజెపి జిల్లా అధ్యక్షురాలు రావు, పద్మా రెడ్డి, డాక్టర్ పెసర్ విజయచందర్ రెడ్డి, డాక్టర్ సంతోష్ కుమార్,డాక్టర్ ఖాళి ప్రసాద్, కాచం గురు ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్పి జయంత్ లాల్,మార్త బిక్షపతిలకు బిజెపి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# జల్లెడ పడుతున్న బలగాలు...

## ఆకుల్లా రాలిపోతున్న మావోయిస్టులు

వరంగల్: అసలే వేసవి కాలం, మరోవైపు లోక్‌సభ ఎన్నికలు... మరోవైపు అడవిని జల్లెడ పట్టేస్తున్న భద్రతా బలగాలు.. మొత్తానికి మావోయిస్టులకు పెద్ద చిక్కే వచ్చి పడింది. అందుకే నెల రోజులుగా అడవిలో తుపాకుల మోత పెరుగూ వస్తోంది. ఇది మావోయిస్టులకు కోలుకొని దెబ్బ తీస్తోంది. వరుస ఎన్‌కౌంటర్లతో దళాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. నెలరోజుల వ్యవధిలో తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లోని మహారాష్ట్ర ఛత్తీస్‌గఢ్‌లో నాలుగు ఎన్‌కౌంటర్లు జరిగాయి. ఎండాకాలం వచ్చిందంటే చాలు మావోయిస్టులకు గడ్డుకాలం మొదలైనట్టే. ఆకు రాలే కాలాన్ని అనుకూలంగా మార్చుకునే భద్రతా సిబ్బంది వేట మొదలు పెడుతుంటారు. అందులో ఎన్నికల సీజన్ కూడా కలిసి వచ్చింది. అందుకే వరుస ఎన్కౌంటర్లతో పచ్చని అడవి నెత్తుటి రంగును పూసుకుంటోంది. మావోయిస్టులను అంతమొందించడానికి భద్రతా బలగాలు వేసవిని ఉపయోగించు కుంటున్నాయి. దీనికి తోడు ఆధునిక టెక్నాలజీ కూడా వారికి మరింత సాయం చేస్తోంది. గూగుల్ మ్యాప్, శాటిలైట్, డ్రోన్ల వ్యవస్థతో గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న మావోయిస్టులపై ఉక్కు పాదం మోపుతున్నారు. అందుకే ఆకు రాలుతున్నట్టు మావోయిస్టులు నేలరాలుతున్నారు. వేసవికాలం మావోయిస్టులకు కలిసి రాని కాలం. మావోయిస్టులకు పచ్చని అడవులు షెల్టర్ జోన్లు. అడవి ఎంత పచ్చగా ఉంటే మావోలు అడవుల్లో అంత బలంగా ఉంటారు. వేసవి కాలంలో పచ్చని అడవి ఆకురాల్చి ఎడారిగా మారుతుంది. దీంతో మావోలకు సురక్షితమైన షెల్టర్ జోన్లు లేకుండా పోతాయి. మావోలు ఎక్కువగా నీటి మీద ఆధారపడి ఉంటారు. వేసవికాలం కావడంతో అడవుల్లో నీటికుంటలు, చెలిమలు ఎండిపోతాయి. దీంతో మావోయిస్టులు నీటి గోదావరి పరివాహక ప్రాంత వాగుల వెంట రాకతప్పదు. అంతేకాకుండా సేఫ్ జోన్‌లకు వెళ్ళడానికి రాష్ట్రాల సరిహద్దులు దాటాల్సి వస్తుంది.మావోయిస్టుల ఏరివేతకు ఎండాకాలం అనువైనది భావిస్తున్న కేంద్ర, రాష్ట్ర బలగాలు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో జల్లెడతున్నారు.

కూంబింగ్‌తోపాటు శాటిలైట్, మూడు రాష్ట్రాల్లోని గోదావరి వెంట గూగుల్ మ్యాప్‌లతో మావోయిస్టుల ఏరివేత జరుగుతుంది. అన్నీ కలిసి వచ్చి పైచేయి సాధిస్తున్నాయి పోలీస్ బలగాలు. అందుకు నెల రోజుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లే నిదర్శనంగా చెప్పవచ్చు.మార్చి 19న మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. తెలంగాణ నుంచి మహారాష్ట్ర బీజాపూర్‌లోనీ ప్రాణహిత నది దాటి సమయంలో పోలీస్‌లకు మావోలకు ఎదురుకాల్పులు జరిగాయని పోలీస్‌లు తెలిపారు.మార్చి 27న చత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్ కౌంటర్ జరిగి ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. బాసగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని బీజాపూర్ సుక్మా సరిహద్దు ప్రాంతంలోని చీపుర్‌భట్టి ప్రాంతంలో ఎదురు కాల్పులు జరిగి ఒక డిప్యూటీ కమాండర్ సహా ఆరుగురు మావోలు మృతి చెందారు.ఏప్రిల్ 2న ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లా కోర్చోలి అడవుల్లో తెల్లవారు జామున జరిగిన ఎదురు కాల్పుల్లో 13 మంది మావోయిస్టులు మృతి చెందారు. మావోయిస్టుల ఏరివేతలో భాగంగా కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్న క్రమంలో కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో పోలీస్‌లు ఆధునిక ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. గత వారం కూడా అడవుల్లో తుపాకీ మోతలు మోగాయి. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. ములుగు జిల్లా కర్రిగుట్టలు, ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ పరిధిలో ఉన్న అటవీ ప్రాంతంలో పోలీసులు కూంబింగ్ చేస్తున్న క్రమంలో భద్రతా బలగాలకు మావోయిస్టులకు కాల్పులు జరిగాయి. ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలంలో ఏకే-47తోపాటు మూడు తుపాకులు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ వెల్లడించారు. నెలరోజుల వ్యవధిలోపే జరిగిన 4 ఎన్ కౌంటర్లలో 26మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఎన్‌కౌంటర్లు నీటి పరివాహక ప్రాంతాలతోపాటు ఉదయం సమయాల్లో జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఎన్ కౌంటర్లలో చనిపోయిన వారిలో యువతే ఎక్కువగా ఉన్నారు. ఎండాకాలం మావోయిస్టులను కోలుకోలేని దెబ్బతీస్తుందని చెప్పవచ్చు.

# షాను మార్చేసిన ఐపీఎల్

ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్.. ఆ క్రికెటర్ ను కోటీశ్వరుణ్ణి చేసింది. అతడు కూడా ఐపీఎల్ లో అనామక జట్టుకు కాకుండా.. పేరొందిన జట్టుకే ఎంపికై ఆడాడు. తన ప్రతిభను నిరూపించుకున్నాడు. ఐపీఎల్ అనేది క్యాష్ రీచ్ లీగ్ కాబట్టి.. అతని ఆటకు మేనేజ్మెంట్ ఫిదా అయింది. ఇంకేముంది డబ్బులే డబ్బులు. ఇటు పేరుకు పేరు.

ఫలితంగా ఆ ఆటగాడు తన స్థాయికి తగ్గట్టుగా ఇంటిని కొనుగోలు చేశాడు. అది ప్రస్తుతం టాక్ ఆఫ్ ది టౌన్ అయిపోయింది.ఐపీఎల్ లో ఎందరు స్టార్ క్రికెటర్లు ఉన్నా పృథ్వీ షా స్థానం మాత్రం ప్రత్యేకం. ఎందుకంటే అతడు జట్టులో స్థానం కోసం ఎంతో కష్టపడ్డాడు. తనను తాను నిరూపించుకున్నాడు. అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు ఒంటి చేత్తో గెలిపించాడు. అయితే ఇన్నాళ్లకు ఆర్థికంగా స్థిరపడటంతో.. తను ఖరీదైన ఇల్లు కొనుగోలు చేశాడు. దేశ వాణిజ్య రాజధాని ముంబైలోని బాంద్రా ప్రాంతంలో సముద్రానికి దగ్గరలో ఉండే ఒక ఫ్లాట్ కొనుగోలు చేశాడు. అంతేకాదు ఫ్లాట్ కొనుగోలు చేసిన అనంతరం ఎమోషన్ అయిపోయాడు. "ఈ ప్రదేశం గురించి ఎన్నో కలలుగన్నాను. వాటిని ఇప్పుడు నిజం చేసుకోవడం చాలా సంతోషంగా ఉంది.

నాకంటూ సొంత ఇల్లు ఉండాలనేది ఎప్పటి నుంచో ఒక కల. అది ఇప్పుడు నిజమైంది. సొంత ఇల్లు అనేది స్వర్గం లాంటిది. ఇకమీదట అంతా మంచే జరుగుతుందంటూ" రాసుకొచ్చాడు. ప్రస్తుతం అతడి సొంత ఇంటికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.ఇక పృథ్వీ షా ఫ్లాట్ చూసిన నెటిజన్లు.. ఇల్లు అద్భుతంగా ఉందని అంటున్నారు. అంతా మంచే జరగాలని అభిలాషిస్తున్నారు. ఫ్లాట్ నిర్మాణం చాలా బాగుందని.. ముంబై లాంటి ప్రాంతంలో సరైన ఎంపిక అని కొనియాడుతున్నారు..పృథ్వీ షా టీమిండియాలోకి 2018లో వచ్చాడు.

ఓపెనర్ గా ఆడుతూ మంచి పేరు సంపాదించుకున్నాడు. అయితే తన స్థానాన్ని జట్టులో సుస్థిరం చేసుకోవడంలో విఫలమయ్యాడు. గట్టి కంబ్యాక్ ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నప్పటికీ అవి సఫలం కావడం లేదు. దేశవాళి క్రికెట్లో రాణిస్తున్నప్పటికీ సెలెక్టర్లు అతడిని లెక్కలోకి తీసుకోవడం లేదు. ఇటీవల అతడు గాయపడ్డాడు. దాని నుంచి కోరుకున్నాడు. రంజి ట్రోఫీలో అదరగొట్టాడు. ముంబై జట్టు కప్పు సాధించడంలో తన వంతు పాత్ర పోషించాడు. ఇక ఐపీఎల్ లో ప్రస్తుతం ఢిల్లీ జట్టుకు ఆడుతున్నాడు. మెరుగైన ఆరంభాలు అందిస్తున్నాడు. ఇప్పటిదాకా ఆడిన మూడు మ్యాచ్ లలో 119 పరుగులు చేశాడు.

# గులాబీకి బిగ్ రిలీఫ్

హైదరాబాద్: ఎన్నికలు అనగానే బీఆర్ఎస్‌ను పదేళ్లుగా కొన్ని గుర్తులు భయపెడుతున్నాయి. అదేంటి బీఆర్ఎస్‌కు పర్మినెంట్ కారు గుర్తు ఉండిగా, భయమెందుకు అనుకుంటు న్నారా.. అక్కడే సమస్య. కారును పోలిన కొన్ని గుర్తులు ఎన్నిల్లో బీఆర్ఎస్ ఫలితాలను తారుమారు చేస్తున్నాయి. గెలిచే అభ్యర్థి ఓడిపోతున్నారు. దీంతో అనేకసార్లు గులాబీ పార్టీ నేతలు తమ కారు గుర్తును పోలిన గుర్తులను ఎవరికీ కేటాయించొద్దని ఎన్నికల సంఘానికి పలుమార్లు విన్నవించారు. ఫిర్యాదు చేశారు. చివరకు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టును కూడా ఆశ్రయించారు. అయితే సుప్రీ కోర్టు గుర్తుల కేటాయింపు విషయంలో బీఆర్ఎస్‌కు షాక్ ఇచ్చింది. దీంతో ఇక ఫిర్యాదులు చేయడం మానేసింది. ఇంతలో 2023 నవంబర్ లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ ఓడిపో యింది. కారు గుర్తును ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో భారీగా ఖర్చు చేసింది. సోషల్ మీడియా ఇన్ఫ్లూయెన్స ర్లను రంగంలోకి దించింది. పాటలు కైగట్టింది. గుర్తుల గుర్తుంచుకో రామక్క.. కారును గుర్తుంచుకో రామక్క అంటూ ఊరూ వాడా మార్మోగింది. అయినా ప్రజలు కారు గుర్తును పెద్దగా పట్టించుకోలేదు. పదేళ్ల పాలనపై ఉన్న వ్యతిరేకతతో కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. ఇక కొన్ని చోట్ల కారును పోలిన గుర్తులతో కొంతమంది స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు.ఈ క్రమంలో పార్లమెంటు ఎన్నికల వేళ కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. బీఆర్ఎస్‌ను దశాబ్ద కాలంగా భయపెడుతున్న ఆటోరిక్షా, చపాతీకర్ర, రోడ్డు రోలర్, ఎండకు పెట్టుకునే టోపీ, ట్రక్కు, ఐరన్ బాక్సు వంటి గుర్తులను పార్లమెంటు ఎన్నికల్లో ఎవరికీ కేటాయించకూడదని నిర్ణయించింది. అయితే ఈ ఆదేశాలు కేవలం రెండు తెలుగు రాష్ట్రాలకే వర్తింస్తాయని తెలిపింది. ఇతర రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ గుర్తులు ఉంటాయని పేర్కొంది.రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కొన్ని గుర్తులను తొలగించడంపై ఇప్పుడు చర్చ జరుగుతోంది. గుర్తింపు పొందిన పార్టీలైన బీఆర్ఎస్ తెలంగాణలో, వైసీపీ ఏపీలో కొన్ని ఫిర్యాదులు చేశాయి. తెలంగాణలో బీఆర్ఎస్ పర్మినెంటు గుర్తు కారును పోలిన రోడ్ రోలర్, ఆటోరిక్షా వంటివి ఉన్నాయి. దీంతో నిరక్ష్యరాస్యులు, వృద్ధులు పొరపాటుగా.. కారుకు వేయాల్సిన ఓటు రోడ్ రోలర్, ఆటోరిక్షాపై వేస్తున్నారు. ఫలితంగా బీఆర్ఎస్‌కు నష్టం జరుగుతోంది.2014లో ఈ గుర్తుల కారణంగా కొన్ని సీట్లు స్వల్ప తేడాతో కోల్పోయింది. ఈ నేపథ్యంలో పార్లమెంటు ఎన్నికల వేళ ఈసీ ఈ నిర్ణయం తీసుకుంది.ఇక ఏపీలో అధికార వైసీపీ పర్మినెంట్ గుర్తు ఫ్యాన్. దీనిని పోలినట్లుగా చపాతీకర్ర, క్యాప్, ఐరన్ బాక్సు వంటివి ఉన్నాయని వైసీపీ పలుమార్లు ఈసీకి ఫిర్యాదు చేసింది. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌కు ముందు కూడా మళ్లీ ఫిర్యాదు చేసింది. దీంతో ఎన్నికల సంఘం ఫ్యాన్‌ను పోలిన గుర్తులను ఏపీలో వినియోగించకుండా నిర్ణయం తీసుకుంది. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆటో రిక్షా, చపాతి కర్ర,రోడ్డు రోరల్, ఎండకు పెట్టుకునే టోపీ, ట్రక్కు, ఐరన్‌బాక్సు వంటివి ఎవరికీ కేటాయించదు.

# కరువే అజెండా....!

హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికల వేళ తెలంగాణలో కరవు పరిస్థితులను ప్రధాన పార్టీలు ప్రచారాస్త్రంగా వాడుకుంటున్నాయి. ఇది ప్రకృతి తెచ్చిన కరవు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరవు అని ఒకవైపు బీఆర్ఎస్ ఆరోపిస్తుంటే... కాంగ్రెస్ పార్టీ మాత్రం గత ప్రభుత్వ పాలన విధానాలతో పాటు ప్రకృతి తెచ్చిన కరవు అంటూ ఆరోపణలు తిప్పికొడుతుంది. ఇదిలా ఉంటే ఈ కరవుకు కాంగ్రెస్, బీఆర్ఎస్.....ప్రభుత్వాలు రెండూ కారణమని, కరవును అడ్డుకోవడం మానేసి రెండు పార్టీలు స్వార్థ రాజకీయాలు చేస్తున్నాయని బీజేపీ ఆరోపిస్తోంది. ఇలా తెలంగాణలో కరవు చుట్టూ రాజకీయాలు తిరుగుతున్నాయి.సాగు, తాగునీటి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని, ప్రాజెక్టుల గేట్లు ఎత్తి రైతుల సమస్యల పరిష్కరించడానికి బదులుగా కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ గేట్లు ఎత్తి వలస నేతలపై దృష్టి పెట్టిందని....ప్రజలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి బాధ్యత లేదని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ అసమర్థత, చేతకాని తనంతోనే రాష్ట్రంలో కరవు వచ్చిందని ప్రకృతి వనరులను కాపాడుకోవడంలో కాంగ్రెస్ పార్టీకి ముందుచూపు లేదని ఆరోపిస్తున్నారు. ఇది కాంగ్రెస్ తెచ్చిన కరవేనంటూ జనంలో పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. ఆ పార్టీ అధినేత కేసీఆర్ సైతం ఇటీవలే పలు జిల్లాలో పర్యటించి రైతులకు దగ్గరయ్యే ప్రయత్నాలు చేశారు. రైతు సమస్యలు పరిష్కారం కోసం రైతు దీక్షలపేరుతో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలో ఆ పార్టీ నేతలు పాల్గొన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే రూ.25 వేల పరిహారం చెల్లించడంతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని, రైతు రుణమాఫీ రెండు లక్షలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కరవు సమస్య పైన విస్తృతంగా ప్రచారం చేయాలని బీఆర్ఎస్ భావిస్తుంది.రైతుల అంశాన్ని, కరవును ప్రస్తావిస్తూ బీజేపీ నేతలు రాష్ట్రవ్యాప్తంగా రైతు సత్యాగ్రహ దీక్షలు నిర్వహిస్తున్నారు. కరవు ఏ కారణంగా వచ్చినా...... ఆర్థికంగా నష్టపోయిన రైతులని ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు, గ్యారంటీలు(అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ పార్టీ.... ఇప్పుడు పాంచ్ న్యా?య్పేరుతో మరోసారి ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమైందని ఆ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. రైతు భరోసా, రుణమాఫీ, వరికి బోనస్, పంటల బీమా, రైతు కమిషన్ వంటి హామీలను ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు 10 ఏళ్ల రైతులను నట్టేట ముంచిన కేసీఆర్ ఇప్పుడు ఎండిన పంట పొలాలను సందర్శించడం విడ్డూరంగా ఉందని బీజేపీ నేతలు విమర్శిస్తున్నారు. గతంలో 30 లక్షల ఎకరాల్లో పంట నష్టపోతే ఏనాడు సాయం అందించని కేసీఆర్..... ఇప్పుడు సిగ్గు లేకుండా అధికారం కోల్పోవడంతో రైతులపై ముసలి కన్నీరు కారుస్తున్నారు అని ఎద్దేవా చేస్తున్నారు.ఇదిలా ఉంటే మరో వైపు రైతులు, ప్రజలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సాగు, తాగునీటి సమస్యలకు కారణం గత ప్రభుత్వ పాలనే కారణమని అధికార కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్నారు. దీని లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగం చేయాలని భావిస్తున్నారు. ఇదే సమయంలో ప్రస్తుత ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యామ్నాయ చర్యలను ప్రజలకు వివరించనున్నారు. ఇదే పరిస్థితి ఇక పైన కొనసాగితే ఎలా సమాధానం చెప్పుకోవాలనే దానిపై ఇప్పుడు కాంగ్రెస్ నేతల్లో టెన్షన్ మొదలైంది. కరవుకు గత ప్రభుత్వమని విమర్శలు చేస్తూనే......పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని ప్రభుత్వం ఆలోచిస్తోందట. దీంతో పాటు ఎలాంటి అంతరాయం లేకుండా సాగునీరు, తాగునీరు అందించాలని ప్రభుత్వం ఆలోచిస్తుంది. ఇందుకోసం ఉమ్మడి జిల్లాలకు ప్రత్యేక అధికారులను సైతం నియమించింది ప్రభుత్వం. ఏది ఏమైనప్పటికీ ప్రస్తుతం రాష్ట్రంలో ప్రధాన అంశంగా మారిన కరవు ఎవరికి కలిసి వస్తుందో వేచి చూడాలి.

# గరిష్టానికి చేరిన విద్యుత్ వినియోగం

హైదరాబాద్: ఎండలు అదరగొడుతున్నాయి. బయటికి వెళ్లాలంటే జనాలు భయపడుతున్నారు. అత్యవసరమైతేనే కాలు బయటపెడుతున్నారు. ఒకవేళ బయటకు వెళ్లినా వెంటనే తిరిగి వస్తున్నారు. ఎండ వేడిమి కి తట్టుకోలేక శరీరాన్ని చల్లబరుచుకునేందుకు ఫ్యాన్ లేదా కూలర్ లేదా ఏసీలను వాడుతున్నారు. ఫలితంగా విద్యుత్ వినియోగం తారా స్థాయికి చేరుకుంటుంది. తెలంగాణ రాజధాని హైదరాబాదులో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు మించి నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో విద్యుత్ ను డిమాండ్ కు తగ్గట్టుగా సరఫరా చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల వరకు ట్రాన్స్ ఫార్మర్ల పవర్ (సామర్థ్యం) పెంచే పనులు చేపట్టారు. ఇప్పుడు డీటీఆర్ (డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్) లను మార్చేందుకు కసరత్తు చేస్తున్నారు. ఎండలు మండిపోతున్న నేపథ్యంలో ఇంట్లో ఫ్యాన్లు, కూలర్లు, రిఫ్రిజిరేటర్లు, ఏసీలకు ఏమాత్రం విశ్రాంతి ఉండడం లేదు. ముఖ్యంగా తెలంగాణ పరిధిలోని హైదరాబాదులో మార్చి, ఏప్రిల్ నెలలో డిమాండ్ తారాస్థాయికి చేరింది.

పలు సబ్ స్టేషన్లలో 80% కంటే ఎక్కువ లోడ్ ఉన్న పవర్ ట్రాన్స్ ఫార్మర్లను ఎక్కువ సామర్థ్యం ఉన్న వాటితో మార్పు చేశారు. అంతేకాదు పలు కాలనీలో ఉండే డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్లను అధికారులు మార్చేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ క్రమంలో విద్యుత్ వినియోగం అధికంగా ఉండే సమయంలో డీటీఆర్ ల ఖచ్చితమైన లోడ్ గుర్తించే మదింపు చేపడుతున్నారు. టంగ్ టెస్టర్ ద్వారా లోడ్ గుర్తించి విద్యుత్ సిబ్బంది రికార్డ్ చేస్తున్నారు. అయితే ఈ పనిని వారు రాత్రిపూట చేపడుతున్నారు.. విద్యుత్ గరిష్ట డిమాండ్ సాధారణంగా సాయంత్రం సమయంలో ఉంటుంది. ఈ ఏడాది విద్యుత్ వినియోగం తీరు పూర్తిగా మారిపోయింది. ఒక్కో సర్కిల్లో ఒక్కో సమయంలో ఒక్కో తీరుగా నమోదు అవుతున్నది. ఐటీ కార్యాలయాలు, బహుళ అంతస్తులు ఉన్న సైబర్ సిటీ ప్రాంతాల్లో ఏప్రిల్ 5న రికార్డు స్థాయిలో 784.4 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదయింది. గత ఏడాది ఏప్రిల్ 20వ తేదీన గరిష్టంగా నమోదైన 455 మెగావాట్ల కంటే ఇది చాలా ఎక్కువ. నార్సింగి, గచ్చిబౌలి ప్రాంతాలలో పీటీఆర్ సామర్థ్యాన్ని పెంచినప్పటికీ డిమాండ్ అధికంగానే నమోదవుతున్నది. ఈ సర్కిల్ పరిధిలో రాత్రి 11 నుంచి 12 గంటల మధ్య విద్యుత్ డిమాండ్ స్టేజీ లో ఉంటుందని అధికారులు అంటున్నారు. ఇక రాజేంద్రనగర్ సర్కిల్ ప్రాంతంలో సాయంత్రం ఐదు గంటల సమయంలో అత్యధిక లోడ్ రికార్డు అవుతోందని అధికారులు చెబుతున్నారు. ఏప్రిల్ 3న అత్యధికంగా 674 మెగావాట్ల డిమాండ్ నమోదయిందని చెబుతున్నారు. గత ఏడాది ఏప్రిల్ 16న గరిష్ట డిమాండ్ 649.9 మెగావాట్ల డిమాండ్ నమోదయింది. ఇక సరూర్ నగర్ డివిజన్ ప్రాంతంలో ఏప్రిల్ 5న అత్యధికంగా 292.3 మెగావాట్ల డిమాండ్ నమోదయింది. గత ఏడాది ఏప్రిల్ 6న 288 మెగావాట్ల డిమాండ్ రికార్డ్ అయింది. వాస్తవానికి ఈ సర్కిల్ పరిధిలో నివాసాలు అధికంగా ఉంటాయి. అయినప్పటికీ సాయంత్రం ఏడు నుంచి తొమ్మిది గంటల మధ్య విద్యుత్ వినియోగం తారాస్థాయికి చేరుతోంది.హైదరాబాద్ నగరం మాత్రమే కాకుండా రంగారెడ్డి జిల్లాలోనూ ఇదే స్థాయిలో విద్యుత్ వినియోగం ఉంది. ఇక కరీంనగర్, వరంగల్, ఉమ్మడి పాలమూరు, నిజామాబాద్, ఖమ్మం, నల్లగొండ, మెదక్ వంటి జిల్లాల్లోనూ విద్యుత్ వినియోగం తారాస్థాయికి చేరుతోంది. అయితే ఏప్రిల్ కంటే మే లో ఎక్కువగా ఎండలు నమోదయ్యే అవకాశం ఉంది కాబట్టి.. విద్యుత్ వినియోగం మరింత పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నారు..

# రోజుకు 18 వేల కేసుల బీర్ ఔట్

హైదరాబాద్: సాయంత్రం చిల్డ్ బీర్ తో చిల్ అవుదాం... మామా? సినిమాలో ఈ డైలాగ్స్ వింటుంటాం. మద్యం ప్రియులకు సమ్మర్ అంటే గుర్తొచ్చేది చిల్డ్ బీర్ సాయంత్రం కూల్ గా ఓ బీర్, కాస్త స్టఫ్ దగ్గర పెట్టుకుని ఎంజాయ్ చేస్తుంటారు. తెలంగాణలో ఎండలు తీవ్రంగా ఉన్నాయి. గత వారం రోజుల్లో హీట్ వేవ్ పరిస్థితులు ఉన్నాయి. దీంతో మందుబాబులు కూల్ అయ్యేందుకు వైన్ షాపుల వైపు అడుగులు వేశారు.అందినకాడికి బీర్లు తాగేశారు. ఒక్కసారిగా బీర్ల కొనుగోలు పెరగడంతో...స్టాక్ ఖాళీ అయ్యింది. రాష్ట్రంలోని పలు జిల్లా?ల్లో బ్రాండెడ్ బీర్లు దొరకని పరిస్థితి నెలకొంది. రేషన్ ఆధారంగా ప్రధాన బ్రాండ్ల బీర్లను ఒక్కో షాపునకు 20-25 కేస్ లు ఇస్తుండగా...ఇవి సరిపోవడంలేదని మద్యం షాపుల యజమానులు అంటున్నారు.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రోజుకు 60 వేల నుంచి 80 వేల కేస్ ల కు పైగా బీర్లు అమ్ముడవుతున్నట్లు తెలుస్తోంది. సమ్మర్ లో వీటికి అదనంగా మరో 20 వేల కేస్ లు డిమాండ్ ఉంటుంది. అయితే ప్రస్తుతం డిమాండ్ కు తదిన స్టాక్ లేకపోవడంతో మద్యం డిపోలు 60 వేల నుంచి 80 వేల కేస్ లను మద్యం షాపులకు సరఫరా చేస్తున్నాయి. రాష్ట్రంలో ఎండల తీవ్రత( ఎక్కువగా ఉండడంతో...మందుబాబులు బీర్లు లాగించేస్తు?న్నారు. దీంతో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి బీర్ల సేల్స్ అమాంతం పెరుగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా బీర్లకు డిమాండ్ పెరుగుతోందని మద్యం షాపుల నిర్వాహకులు అంటున్నారు. బీర్‌ల కంపెనీల నుంచి రోజుకు లక్షన్నర నుంచి 2 లక్షల కేస్‌ల స్టాక్ వస్తుందని ఎక్సైజ్ శాఖ వర్గాలు చెబుతున్నాయి. వీటిల్లో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఎక్కువ అమ్మకాలు జరుగుతున్నాయి. గత ఏప్రిల్ లో హైదరాబాద్ పరిధిలో దాదాపుగా 12 లక్షల కేస్‌లకు పైగా బీర్ల సెల్స్(ఃవవతీ జరిగితే....ప్రస్తుతం 15 లక్షల కేస్‌లకు పైగా డిమాండ్ వస్తుందని మద్యం వ్యాపారులు అంటున్నారు. రాష్ట్రంలో ప్రతి నెలా 28 నుంచి 30 లక్షల కేస్ ల బీర్లు విక్రయాలు జరుగుతాయని గణాంకాలు చెబుతున్నాయి.హైదరాబాద్ తో పాటు మెదక్, నల్గొండ, యాదాద్రి జిల్లాల్లో బీర్ల అమ్మకాలు( భారీగా ఉన్నాయి. మెదక్ రామాయంపేట, నర్సాపూర్‌లోని ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 49 వైన్ షాపులు, ఐదు బార్లు ఉన్నాయి. వీటి ఈ ఏడాది మద్యం అమ్మకాలు భారీగా పెరిగాయి. గత డిసెంబర్ నుంచి మార్చి వరకు రూ.194.68 కోట్ల మద్యం విక్రయాలు జరగగా, ఈసారి రూ.206.71 కోట్ల విక్రయాలు జరిగాయని తెలుస్తోంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఎండ తీవ్రతను తట్టుకునేందు మందుబాబులు బీర్లు ఖాళీ చేస్తున్నారు. మార్చి నెలలో రోజుకు 17,852 కేస్ ల చొప్పున 30 రో జుల్లో సమారు 5,35,589 కేస్ ల బీర్లు ఖాళీచేశారు. బీర్ల సేల్స్ పెరిగినా లిక్కర్ సేల్స్ తగ్గాయని నిర్వాకులు అంటున్నారు. యాదాద్రి జిల్లాలో సైతం లిక్కర్ సేల్సారీగా పడిపోయాయి. భువనగిరి, ఆలేరు, మోత్కూరు, రామన్నపేట పరిధిలోని మద్యం షాపుల్లో 10,247 కార్టన్ల లిక్కర్ సేల్సుగ్గాయని తెలుస్తోంది. కానీ బీర్లకు మాత్రం డిమాండ్ పెరిగింది.

# మరో వారంలో మొదటి దశ ఎన్నికలు

న్యూఢిల్లీ: 2024 లోక్సభ ఎన్నికల తొలి విడతలో 102 నియోజకవర్గాలకు ఏప్రిల్ 19న 1,625 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో కేవలం 134 మంది మాత్రమే మహిళలు ఉండటం గమనార్హం. అంటే.. ఇది 8శాతం మాత్రమే. లోక్సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు 33% సీట్లు రిజర్వ్ చేసే మహిళా బిల్లుకు 2023 సెప్టెంబర్లో ఆమోదం లభించినప్పటికీ.. అది అమల్లోకి వచ్చేంతవరకు క్షేత్రస్థాయిలో పెద్దగా మార్పులు కనిపించే అవకాశం లేదని ఇది స్పష్టం చేస్తోంది.2019 లోక్సభ ఎన్నికల్లో మొత్తం అభ్యర్థుల్లో 9 శాతం (726) మంది మహిళలు ఉన్నారు. వీరిలో కేవలం 78 మంది మాత్రమే 17వ లోక్సభకు ఎంపికయ్యారు.ఇక ఇప్పుడు.. తొలి దశలో తక్కువ మంది మహిళా అభ్యర్థులు కనిపిస్తున్నారు. మహిళా అభ్యర్థులను నిలబెట్టడానికి రాజకీయ పార్టీలు తొందరపడటం లేదని భారత ఎన్నికల సంఘం విడుదల చేసిన తాజా గణాంకాల ద్వారా స్పష్టమవుతోంది.21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మిజోరం, అండమాన్ నికోబార్ దీవుల్లో వరుసగా 16 శాతం మహిళా అభ్యర్థులు ఉన్నారు. మరోవైపు, మణిపూర్, నాగాలాండ్, లక్షద్వీప్, ఛత్తీస్గఢ్, త్రిపుర, జమ్ము కాశ్మీర్ సహా ఆరు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని పార్టీలు ఒక్క మహిళా అభ్యర్థిని నిలబెట్టలేదు.ఇతర రాష్ట్రాలు / కేంద్రపాలిత ప్రాంతాల్లో.. అరుణాచల్ ప్రదేశ్ 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఒక మహిళా అభ్యర్థిని మాత్రమే నిలబెట్టింది. ఇతర రాష్ట్రాల్లో మహిళా అభ్యర్థుల సంఖ్య.. బిహార్ 3, మధ్యప్రదేశ్ 7, మహారాష్ట్ర 7, మేఘాలయ 2, పుదుచ్చేరి 3, రాజస్థాన్ 12, సిక్కిం 1, ఉత్తర ప్రదేశ్ 7, ఉత్తరాఖండ్ 4, పశ్చిమ బెంగాల్ 4.లోక్సభ ఎన్నికల మొదటి దశలో తమిళనాడులో అత్యధికంగా 950 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో 76 మంది మహిళలు ఉన్నారని ఈసీ గణాంకాలు చెబుతున్నాయి.

ఆ అభ్యర్థులపై క్రిమినల్ కేసులు..

ఇదిలా ఉండగా ఏడీఆర్ నివేదిక ప్రకారం.. 2024 లోక్సభ ఎన్నికల తొలి దశలో బరిలో దిగుతున్న వారిలో 252 మంది.. తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ప్రకటించారు. వీరిలో 161 మంది 'తీవ్రమైన' క్రిమినల్ కేసులు ఉన్నట్లు ప్రకటించారు.

# కరాటే తో ఆత్మ విశ్వాసం ఆత్మ స్థైర్యం పెంపొందుతాయి

**– ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా. వి.నరేందర్ రెడ్డి**

**– కరాటే బెల్ట్ లు, సర్టిఫికెట్ ల ప్రధానోత్సవం**

జగిత్యాల : కరాటే తో ఆత్మ విశ్వాసం ఆత్మ స్థైర్యం పెంపొందుతాయిని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్. వి.నరేందర్ రెడ్డి అన్నారు.. గురువారం జగిత్యాల జిల్లా మల్యాల ఎక్స్ రోడ్ లోని ఆల్ఫోర్స్(ఎన్ఎస్ వి) స్కూల్ లో ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో 2023–24 విద్యా సంవత్సరం కరాటే లో శిక్షణ పొందిన విద్యార్థిని,విద్యార్థులకు కలర్ బెల్ట్ అప్ గ్రేడింగ్ టెస్ట్, సర్టిఫికెట్స్ ల ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ కరాటే అనేది అతి ప్రాచీనమైన యుద్ధ విద్య అని అన్ని యుద్ధ విద్యలకు కరాటే మాతృ కళ అని అన్నారు.అలాగే కరాటే నేర్చుకొని అందులో సాధించే ఎస్జీఎఫ్ఐ సర్టిఫికెట్స్ ద్వారా భవిష్యత్తులో ఉన్నత విద్య మరియు ఉన్నతమైన ఉద్యోగాలు స్పోర్ట్స్ రిజర్వేషన్ కోటాలో సాధించడానికి అవకాశం ఉంటుందని విద్యార్థులకు ఈ సందర్భంగా తెలియజేశారు. అంతేకాకుండా విద్యార్థిని విద్యార్థులకు కరాటే లోని మెలకువలు వాటిని సాధించే ప్రక్రియలలో క్రమశిక్షణ అలాగే సమాజంలో జరిగే విపత్కర పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. మల్యాల ఆల్ఫోర్స్ బ్రాంచ్ కి చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి మరియు జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పాల్గొనటమే కాకుండా పథకాలు సాధించటం అభినందనీయం అని అన్నారు. విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నారు.. ఈ కార్యక్రమానికి చీఫ్ ఎగ్జామినర్ గా తెలంగాణ రాష్ట్ర కరాటే అసోసియేషన్ చైర్మన్ ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ డిప్యూటీ గ్రాండ్ మాస్టర్ కె వసంత్ కుమార్ హాజరై పిల్లల యొక్క శక్తి సామర్థ్యాలు ప్రతిభా పాటవాలను పరీక్షించి అందులో ఉత్తమ ప్రతిభా పాటవాలు అత్యంత నైపుణ్యం కనబర్చిన పిల్లలకి బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ఫోర్స్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయని ఉపాధ్యాయులు,కరాటే అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, కోచ్ మర్రిపెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు నైట్ డ్యూటీలు కాదు..

# పిల్లలపై మానసిక వత్తిడి తగ్గించండి: టీఎస్ యూటీఎఫ్

భీంగల్: గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థుల వరుస ఆత్మహత్యలతో అప్రమత్తమైన సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి నైట్ డ్యూటీ ఉపాధ్యాయుల సంఖ్యను రెండు నుండి నాలుగుకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసి ఉపాధ్యాయులు వంతుల వారీగా రాత్రి కాపలా కాయాలని ఉత్తర్వుల్లో పేర్కొనటాన్ని టిఎస్ యుటిఎఫ్ తీవ్రంగా ఖండిస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మల్కా జనార్ధన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గురుకుల ఉపాధ్యాయులను రాత్రి కాపలాదారు స్థాయికి దిగజార్చడం తీవ్ర అభ్యంతరకరమన్నారు. విద్యార్థుల ఆత్మహత్యలకు వారిపై పెరిగిన మానసిక వత్తిడి కారణమని ఆ అంశాన్ని పరిగణనలోకి తీసుకోకుండా వింతైన ఉత్తర్వులు ఇవ్వటం సమంజసం కాదన్నారు. ఇంటర్, పదవ తరగతిలో ఉత్తమమైన ఫలితాల పేరిట విద్యార్థులను కార్పొరేట్ విద్యాసంస్థల తరహాలో వత్తిడికి గురిచేస్తూ మానసిక ప్రశాంతత లేకుండా చేస్తున్న కారణంగానే కార్పొరేట్ విద్యా సంస్థలకు పరిమితమైన ఆత్మహత్యలు గురుకుల విద్యాసంస్థ లో కూడా జరుగుతున్నాయన్నారు. వీటికి కారణాలను అధ్యయనం చేసి, నివారణ కోసం శాస్త్రీయమైన చర్యలు చేపట్టటానికి మానసిక నిపుణులతో కూడిన అధ్యయన కమిటీని నియమించాలని టిఎస్ యుటిఎఫ్ డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. అత్యధిక గురుకుల పాఠశాలలు అద్దె భవనాల్లో నిర్వహిస్తూ విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించటంలో వైఫల్యం ఉందన్నారు. మెస్ చార్జీలు పెంచుతామని చెప్పి రెండేళ్ళు గడిచినా జిఓ ఇవ్వలేదు.ఎండలను తట్టుకోవడానికి విద్యార్థులకు పుచ్చకాయలు, చల్లని మజ్జిగ, చల్లని నీరు, అందుబాటులో ఉండాలని ఆదేశించారు కానీ అదనపు బడ్జెట్ ఇవ్వకుండా ఎలా సాధ్యమవుతుందన్నారు. ఉపాధ్యాయులపై ఇప్పటికే బోధనేతర పనుల భారం అధికంగా ఉంది. ఇప్పుడు రాత్రి డ్యూటీలో ఉండే ఉపాధ్యాయుల సంఖ్యను పెంచడం ద్వారా వారిపై వత్తిడి మరింత పెరుగుతుందని. కనుక ఉపాధ్యాయులను నైట్ వాచ్ మన్ లు గా మార్చకుండా. విద్యార్థులపై మానసిక వత్తిడిని తగ్గించి ఆహ్లాదకర వాతావరణంలో చదువుకునే విధంగా ప్రోత్సహించాలని జనార్ధన్ కోరారు.

# డంపింగ్ యార్డ్ లో మళ్లీ చెలరేగిన మంటలు

**– దట్టమైన పొగలతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు, పరిసర ప్రాంతాల ప్రజలు**




భగత్ నగర్: కరీంనగర్ నగరపాలక సంస్థకు చెందిన డంప్‌యార్డులో మళ్లీ అగ్గి రాజుకుంది. గత మూడు రోజులుగా కరీంనగర్ డంపింగ్ యార్డ్ లో మంటలు చెలరేగడంతో దట్టమైన పొగలు వెలువడి తీవ్రమైన వాయు కాలుష్యం చోటు చేసుకుంటోంది.దీంతో పరిసర ప్రాంతాలైన ఆటోనగర్, కోతిరాంపూర్,లక్ష్మీనగర్,గాయత్రినగర్, హౌసింగ్ బోర్డు ప్రజలు ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఎండ వేడికితోడు డంప్‌యార్డు నుంచి దట్టమైన పొగ వస్తుండడంతో ఊపిరాడక విలవిలలాడుతున్నారు. కళ్ల మంటలతో ఇబ్బందులు పడుతున్నారు. మానేరు ఒడ్డున ఉన్న డంప్‌యార్డు బైపాస్ రోడ్డుకు ఆనుకుని ఉండడంతో పెద్దపల్లి బైపాస్‌పై వెళ్లే ప్రయాణికులకు రోడ్డు కనబడని పడని విధంగా పొగ కమ్మేసింది. డంప్‌యార్డులో మంటలు అంటుకోవడంతో నగరపాలక సంస్థ అధికారులు, పాలకవర్గం ఫైర్ ఇంజిన్ లను పంపి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా విఫలం చెందినట్లు స్థానికులు చెప్తున్నారు.

పట్టని ప్రజారోగ్యం– మొద్దు నిద్ర వీడని బల్దియా

ఏ కాలమైనా డంపింగ్ యార్డ్ తో సమస్యలు వస్తున్నప్పటికీ , పట్టించి పట్టించుకోనట్లుగా అధికారుల తీరు ఉంటోంది. చెత్త ఎక్కడ పడితే అక్కడ పడేస్తే జరిమానా విధించే బల్దియా అధికారులు, డంపింగ్ యార్డ్ నిర్వహణ పై నిర్లక్ష్య వైఖరి వహించడం విమర్శలకు తావిస్తోంది. బయో మైనింగ్ పేరిట యంత్రాన్ని కొనుగోలు చేసి చెత్తను రీసైక్లింగ్ చెయ్యాలని చూసినా ఆ ప్రయత్నం ఎడారిలో ఒయాసిస్ గా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ డంపింగ్ యార్డ్ కు శాశ్వత పరిష్కారాన్ని చూపించాల్సింది ప్రజలు కోరుతున్నారు.

# చెప్పుకుంటే పరువు పోయే

# చెప్పకుంటే ప్రాణం పోయే

**– మాజీ సర్పంచ్ లు**

**– పెండింగ్ బిల్లులు చెల్లించాలి లేకపోతే ఆత్మహత్యలు చేసుకుంటాం**

నల్లబెల్లి: మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణం నందు నల్లబెల్లి మండల తాజా మాజీ సర్పంచుల సంఘం సమావేశం ఏర్పాటు చేసుకొని నల్లబెల్లి గ్రామ తాజా మాజీ సర్పంచ్ నాన్న బోయిన రాజారాం మాట్లాడుతూ సర్పంచ్ పదవీకాలం ముగిసి రెండు నెలలు దాటి మూడో నెలకి చేరింది మరో రెండు నెలల్లో సర్పంచ్ ఎలక్షన్స్ రానున్నాయి కానీ తాజా మాజీ సర్పంచులు చేసిన పనులకు మాత్రం బిల్లులు విడుదల కావడం లేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు గ్రామ పంచాయతీల మెయింటెనెన్స్, సిబ్బంది జీతాలకే సరిపోతుండడంతో, ఏదైనా పనులు చేయాలంటే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నిధులే అవసరమవుతున్నాయి. గత సర్కారు హయాం నుంచే ఏడాదిగా ఒక్కో గ్రామంలో లక్షలాది రూపాయల బిల్లులు పెండింగ్ లో ఉన్నాయి. గ్రామానికి ఏదైనా చేయాలనే ఆలోచనతో అప్పులు తీసుకొచ్చి పనులు చేశాం.కానీ చేసిన పనులకు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని తాజా మాజీ సర్పంచ్ లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో సర్పంచ్ కు రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షలకుపైగా బిల్లులు రావాల్సి ఉంది. తెచ్చిన అప్పులకు వడ్డీలుపెరుగుతుండటం, బిల్లులు సకాలంలో రాకపోవడంతో తాజా మాజీ సర్పంచ్ లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గత ప్రభుత్వం సర్పంచులబాధలుపట్టించుకోలేదని, ఈ ప్రభుత్వమైనా నిధులు విడుదల చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

నిధులు విడుదల చేసి ఆదుకోకపోతే చావులే శరణ్యమని వారి బాధలను వెలిబుచ్చారు

గత ప్రభుత్వ హయాంలో పనులు చేయించి ఉపాధి హామీ నిధులతో గ్రామ పంచాయతీల్లో రైతు వేదికలు, వైకుంఠ ధామాలు, డంపింగ్ యార్డులను అధికారులు సర్పంచ్ ల వెంటపడి నిర్మించారు. ఒక్కో రైతు వేదికను రూ.22 లక్షల అంచనా వ్యయంతో నిర్మించగా.. ఇందులో ఉపాధి హామీ నిధుల నుంచి కొంత ఖర్చు చేయగా, మిగతా నిధిని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు నిధిని విడుదల చేయలేదు ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వం స్పందించి నిధులను విడుదల చేసి ఆదుకోవాలని విన్నవించారు ఈ కార్యక్రమంలోమాజీ సర్పంచులు నానబోయిన రాజారాం యాదవ్ మామిండ్ల మోహన్ రెడ్డి ఊరటి అమరేందర్ రత్నాకర్ రావు పూల్ సింగ్ తిరుపతి చీకటి ప్రకాష్ నునావత్ వెంకన్న తదితర గ్రామ సర్పంచులు పాల్గొన్నారు

# ప్రభుత్వ బడుల బలోపేతానికే 'అమ్మ' ఆదర్శ కమిటీలు

**– జూన్ మొదటి వారంలోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి**

**– ఎంపీడీవో వేణుమాధవ్**



పెద్దవంగర: ప్రభుత్వ పాఠశాలల బలోపేతంతో పాటు, బడుల అభివృద్ధిలో 'అమ్మ' లను భాగస్వాములను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో వేణుమాధవ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల నోడల్ హెచ్ఎం బుధారపు శ్రీనివాస్ తో పాటుగా, మండలానికి చెందిన గ్రామ సమాఖ్య అధ్యక్షులు, పాఠశాలల హెచ్ఎంలు, వివిధ శాఖల అధికారులతో కలిసి 'అమ్మ' ఆదర్శ పాఠశాల కమిటీల విధివిధానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కమిటీలకు చైర్మన్ గా గ్రామ సంఘం అధ్యక్షురాలు, కన్వీనర్ గా పాఠశాల హెచ్ఎంలు వ్యవహరిస్తారని, ప్రతి తరగతి నుంచి ముగ్గురు తల్లులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. రెండేళ్ల పాటు కొనసాగే ఈ కమిటీలు పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన కు తీర్మానాలు చేసి అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందన్నారు. వీటితో పాటు విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని పరిశీలించడం తో పాటు మధ్యాహ్న భోజనం నిర్వహణ, పాఠశాలకు ప్రభుత్వ పరంగా మంజూరైన నిధులు నిర్వహణ కూడా చూస్తారన్నారు. ఇక నుంచి పాఠశాలలో జరిగే అభివృద్ధి పనులు అన్నీ 'అమ్మ' ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారానే జరుగుతాయని చెప్పారు. జూన్ మొదటి వారంలోగా ఆయా ఎంపిక చేసిన పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. కాగా మండలంలో గత నెల మార్చి 14, 15 తేదీల్లో 'అమ్మ' ఆదర్శ పాఠశాల కమిటీల ఎంపిక పూర్తయిందని, పాఠశాలలకు కమిటీ పేరిట బ్యాంకు ఖాతాలు తెరవడం జరిగిందన్నారు. మండలంలోని 20 పాఠశాలలు 'అమ్మ' ఆదర్శ పాఠశాల కమిటీల కింద ఎంపికైనట్లు తెలిపారు. వీటిలో 2 జెడ్పీ ఉన్నత పాఠశాలలు చిట్యాల, బొమ్మకల్, 3 ప్రాథమికోన్నత పాఠశాలలు పోచంపల్లి, ఉప్పెరగూడెం, కొరిపల్లి, 15 ప్రాథమిక పాఠశాలలు పడమటి తండా, జయరాం తండా, ఉప్పరగూడెం, రామచంద్రు తండా, పెద్దవంగర ఎక్స్ రోడ్డు, సోమ్ల తండా, కొరిపల్లి తండా, శంకర్ తండా, భద్రు తండా, పోచారం, చిన్నవంగర, ఎల్బీ తండా, కిష్టు తండా, బావోజి తండా, రెడ్డికుంట తండా పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 4 ప్రాథమిక పాఠశాలు పడమటి తండా, జయరాం తండా, సోమ్ల తండా, భద్రు తండా పాఠశాలలు విద్యార్థులు లేక గతంలోనే మూత పడ్డాయని అధికారులు వివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీఓ సత్య నారాయణ, ఏపీఎం రమణాచారి, ఏఈ అశోక్,ఆయా గ్రామాల గ్రామ సమాఖ్య అధ్యక్షులు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం కాంగ్రెస్ లో కొత్త ముఖం..



ఖమ్మం: మొన్నటి అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆ ముగ్గురికి కీలక పదవులను దక్కాయి. రాష్ట్ర రాజకీయాల్లో వారు ఇప్పుడు "కీ"రోల్ పోషిస్తున్నారు. ఒకే జిల్లాకు చెందిన నేతలైనప్పటికీ కేబినెట్ లో ఆ ముగ్గురికి దక్కిన అరుదైన గౌరవం మరెవరికీ దక్కలేదు. అయినా సరే ఆ ముగ్గురూ అధిష్టానం దగ్గర మరింత అత్యాశపడ్డారు. తమ కుటుంబ సభ్యులకు పదవి కావాలని పాకులాడారు. ఈ పరిణామాన్ని నిశితంగా గమనించిన కాంగ్రెస్ అధిష్టానం మెల్లగా ఆ ముగ్గురికీ చురక వేసింది. మీకు ఇక "నో ఛాన్స్" అంటూ సున్నితంగానే చేయిచ్చింది.గత కొంత కాలంగా ఖమ్మం పార్లమెంటు స్థానం అందరి నోళ్లలోనూ హాట్ టాపిక్ గా మారింది.

జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులు తమ వారి కోసం పాకులాడటమే ఇందుకు ప్రధాన కారణంగా మారింది. రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నేతలుకుసుమ కుమార్, వి.హనుమంతరావు సైతం ఈ టిక్కెట్ కోసం పోటీ పడుతున్న నేపథ్యంలో ఈ టిక్కెట్ కు మరింత పోటీ పెరిగింది. అయితే కేబినెట్ లో కీలక పదవులు అనుభవిస్తూ మళ్లీ తమ కుటుంబ సభ్యులకు పదవులు కావాలని పోటీ పడిన ముగ్గురు మంత్రుల వ్యవహారం విమర్శలకు దారితీసింది. ఎంతో సున్నితమైన ఈ అంశాన్ని కాంగ్రెస్ అధిష్టానం సునిశితంగా పరిశీలించి ఒక నిర్ణయానికి వచ్చినట్లు స్పష్టమవుతోంది. మంత్రుల కుటుంబ సభ్యులెవరికీ ఖమ్మం ఎంపీ టిక్కెట్ ఇచ్చే ప్రసక్తిలేదని అధిష్టానం ఎట్టకేలకు తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది.ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తమ సతీమణికి టిక్కెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేశారు. అలాగే రెవెన్యూ మంత్రి పొంగులేటితన సోదరుడు ప్రసాద్ రెడ్డికి టిక్కెట్ ఇప్పించుకునే ప్రయత్నాలు చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం తన కుమారుడు యుగంధర్ కి టిక్కెట్ కావాలని పట్టుపట్టారు. కాగా అధిష్టానం పెద్దలు వీరు మినహా వేరే పేర్లు సూచించాలని కోరినట్లు వినికిడి. దీంతో ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలిసింది. ముగ్గురు మంత్రులతో అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు ఆయన ఆంతరంగికులు సైతం చర్చలు జరిపినట్లు సమాచారం. ఈ ఫలితంగా ఇప్పటి వరకు ఒకరికొకరు తీవ్రంగా పోటీ పడిన ఈ ముగ్గురు అమాత్యులు అనివార్యంగా పోటీ నుంచి తప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడినట్లు స్పష్టమవుతోంది.తీవ్రమైన పోటీ నెలకొన్న ఖమ్మం పార్లమెంట్ టిక్కెట్ రేసులో ఏకంగా ముగ్గురు మంత్రులు పోటీ నుంచి తప్పుకోవడంతో తిరిగి మిగిలిన ఆశావహుల ఆశలు ఊపిరి పోసుకున్నాయి. ఇక ఎవరికి వారుగా తమ ప్రయత్నాలను యథావిధిగా మొదలుపెట్టారు. జిల్లాకు చెందిన మంత్రులను తమ ప్రయత్నాలను విరమించుకోవాలని చెప్పిన ఏఐసీసీ వారినే ఎంపీ అభ్యర్థిని సూచించాలని కోరడం గమనార్హం. దీంతో మంత్రులు అయోమయంలో పడ్డారు. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ ఆధిక్యంతో విజయం సాధించింది. కాగా బీఆర్ఎస్ సిట్టింగ్ అభ్యర్థి నామా నాగేశ్వరరావునే తిరిగి బరిలో నిలపగా, బీజేపీ వినోద్ రావుకు టిక్కెట్ ఇచ్చింది. అయితే ఎవరెన్ని అంచనాలు వేసుకున్నా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఈ సీటును అత్యంత సులువుగా గెలుచుకోగలుగుతుందని నిపుణులు అంచనా. ఈ అనుకూల పరిస్థితి క్రమంలో టికెట్ ఎవరికి దక్కుతుందన్న ఆసక్తి ఇప్పుడు మరింతగా పెరిగింది.ఇటీవల హైదరాబాద్ తుక్కుగూడలో జరిగిన జనజాతర సభకు వచ్చిన రాహుల్ గాంధీబస చేసిన హోటల్ కు జిల్లా నేతలను పిలిచి ఖమ్మం టికెట్ విషయంపై క్లారిటీ ఇచ్చినట్లు సమాచారం. కాగా గత నెల 31వ తేదీన ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ సమావేశంలో ఖమ్మం సీటు విషయంపై జరిగిన చర్చల్లో ఇద్దరు పేర్లు వచ్చినప్పటికీ వారిని పక్కన పెట్టారని తెలుస్తోంది. దీంతో కొత్త వారి కోసం అన్వేషణ ప్రారంభించారని సమాచారం. అయితే ఇప్పటికే కొందరు ఆశావహులు మళ్ళీ తమ ప్రయత్నాలు ప్రారంభించారు. వారిలో వంకాయలపాటి రాజా, జట్టి కుసుమ కుమార్, రఘురాంరెడ్డి ఉన్నారు. కాంగ్రెస్ లో చాలా కాలంగా పని చేస్తూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో పాలేరు టికెట్ ఆశించి భంగపడిన రాయల నాగేశ్వరరావు, మువ్వా విజయబాబు, మహమ్మద్ జావీద్ లాంటి వారు కూడా మంత్రుల కుటుంబ సభ్యులకు ఇవ్వకుంటే తమకు ఇవ్వాలని కోరుతున్నారు. మొత్తానికి ఖమ్మం లోక్ సభకు కాంగ్రెస్నుంచి ఎవరు అభ్యర్థి అవుతారో అనే విషయం అతి పెద్ద ఫజిల్ గా మారింది.

# యాదాద్రిలో వరుస దొంగతనాలు

యాదాద్రి: యాదాద్రి భువనగిరి జిల్లాలో వరస దొంగతనాలతో ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారు..డిచిన ప్రతి రోజుల్లోనే 8 దొంగతనాలు జరిగాయి. మోట కొండూరు మండలం కాటేపల్లి గ్రామంలో భవనం పై నిద్రిస్తున్న మహిళ మెడలో నుండి మూడున్నర తులాల పుస్తెలతాడును ఎత్తుకెళ్లారు. సంఘటన స్థలానికి చేరుకున్న డిసిపి రాజేష్ చంద్ర. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని తెలిపారు.. గడిచిన 10 రోజుల్లో 8 దొంగతనాలు జరిగాయి ఆలేరు బోనగిరి మోటకొండూరు బీబీనగర్ ప్రాంతాల్లో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి.. భువనగిరి మండలం చీమల కొండూరు నాగిరెడ్డిపల్లి బోనగిరి టౌన్ లో దొంగతనాలు జరిగాయి.. ఆలేరు పట్టణంలో మరియు మూటకొండూరు మండలం కాటేపల్లి గ్రామంలో దొంగతనాలు జరిగాయి.. ఆరు బయట నిద్రిస్తున్న మహిళలే టార్గెట్గా చేస్తూ రోజు కొత్త రకాలు దొంగతనాలు చేస్తున్నారు దొంగతనం చేసి వెళ్లే వరకు కూడా అక్కడ నిద్రిస్తున్న వారికి కూడా కనీసం స్పృహ లో లేకుండా ముందస్తుగా వారు ప్రయత్నాలు చేస్తున్నారు..

# నీటిని వృధా చేయొద్దు..

# పొదుపుగా వాడుకోవాలి



కమ్మర్ పల్లి: ప్రజలు నీటిని వృధా చేయకుండా, పొదుపుగా వాడుకోవాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కొత్తచెరువు తండా గ్రామపంచాయతీ పరిధిలోని పలు తండాల్లో ఆయన పర్యటించారు. తండాల్లో నెలకొన్న నీటి సమస్యలపై ఆయన పలు నివాస గృహాలను సందర్శించి ప్రజలతో మాట్లాడి నీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు ఆయన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. గ్రామం తో పాటు తండాల్లో ఉన్న వాటర్ ట్యాంకులను, మినీ వాటర్ ట్యాంకులను పరిశీలించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా తగు జాగ్రత్తలు పాటించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఎక్కడైనా పైప్ లైన్ మరమ్మతులు ఉంటే తక్షణమే మరమ్మతులు చేయించాలన్నారు. తాగునీటి కోసం ప్రజలు ఎక్కడ కూడా రోడ్డెక్కే పరిస్థితి లేకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. రికార్డులను పరిశీలించిన ఆయన చిన్నారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని అంగన్వాడి సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయన గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీలను సందర్శించి పరిశీలించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున మొక్కల సంరక్షించేందుకు తగిన జాగ్రత్తలు పాటించాలని నర్సరీ నిర్వాహకులకు సూచించారు. గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఆయన ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఆ కూలీలకు గిట్టుబాటు అయ్యేలా పని కల్పించాలని, కూలి డబ్బులు సక్రమంగా అందేలా చూడాలని ఈజిఎస్ సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన పదాన్ని కూలీల హాజరు రిజిస్టర్ ను, కూలీలు చేసిన పని కొలతల రిజిస్టర్ లను తనిఖీ చేశారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి సదాశివ్, పంచాయతీ కార్యదర్శులు రజిత, నవీన్ గౌడ్, తదితరులు ఉన్నారు.

# బాధ్యతగా 'తెలుగు ఫిల్మ్ డిజిటల్ మీడియా'




ఈ ఆవిర్భావ సమావేశంలో సినీ ప్రముఖులు, నిర్మాతలు దిల్ రాజు, దామోదర ప్రసాద్, ప్రసన్న కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు సాంకేతికంగా ఇటీవలి మీడియాలో అసాధారణ మార్పులు కనిపిస్తున్నాయి. పత్రికలు, 24/7 వార్తాచానెళ్లతో పాటు డిజిటల్ మీడియాలో వెబ్‌సైట్స్, సోషల్ మీడియా, బ్లాగర్స్, ఇన్‌ఫ్లూయెన్సర్లు ప్రసార– సమాచారం రంగంలో కీలక పాత్రను పోషిస్తున్నారు. అయితే వేగంగా మార్పులు జరుగుతున్న కారణంగా జవాబుదారీతనం లోపిస్తున్నదనే విమర్శలు, వాదనలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో వార్తల ప్రసారం, ప్రచురణ విషయంలో జవాబుదారీతనం ఉండేలా.. కొన్ని ప్రతికూల అంశాలను నిర్మూలించేందుకు, టార్గెట్ ఆడియెన్స్‌కు వాస్తవాలను చేరవేసేందుకు తెలుగు సినీ, మీడియా రంగానికి సంధాన కర్తగా వ్యవహరించే విధంగా తెలుగు ఫిల్మ్ డిజిటల్ మీడియా అసోసియేషన్ ఆవిర్భవించింది. ఇప్పటికే సినీ జర్నలిస్టుల సంక్షేమం కోసం విశేషంగా సేవలు అందిస్తున్న తెలుగు ఫిలిం జర్నలిస్ట అసోసియేషన్ కు అనుబంధంగా సేవలు అందించేందుకు ఈ అసోసియేషన్ ఏర్పాటైంది. ఈ ఆవిర్భావ సమావేశంలో సినీ ప్రముఖులు, నిర్మాతలు దిల్ రాజు, దామోదర ప్రసాద్, ప్రసన్న కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అలాగే టీఎఫ్‌జేఏ కార్య నిర్వాహక కమిటీ సభ్యులు, ప్రసిడెంట్ లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి వైజే రాంబాబు, కోశాధికారి నాయుడు సురేంద్ర కుమార్, సభ్యులు జీవీ, శేఖర్, వీఆర్ మధు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో తెలుగు ఫిలిం డిజిటల్ మీడియా అసోసియేషన్ కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ అసోసియేషన్ కార్యవర్గంలో అధ్యక్షులుగా వీ ప్రేమ మాలిని, ప్రధాన కార్యదర్శిగా వీఎస్ఎన్ మూర్తి, కోశాధికారిగా శివ మల్లాల, ఉపాధ్యక్షులగా నిశాంత్ ఎన్, రాజబాబు అనుముల, సంయుక్త కార్యదర్శిగా బీ వేణుగోపాల్, ఎండీ అన్వర్‌తోపాటు 30 మంది కార్యవర్గ సభ్యులు ఉన్నారు. ఈ సమావేశంలో దిల్ రాజు మాట్లాడుతూ.. సినీ జర్నలిస్టులు, సినిమా పరిశ్రమ ఓ కుటుంబంలా ఉంటుంది. ఎప్పటి మాదిరిగానే టీఎఫ్‌జేఏకు అందించిన సహకారం, ప్రోత్సాహాన్ని నూతనంగా ఎంపికైన అసోసియేషన్‌కు ఉంటుంది. జవాబుదారీతనం లక్ష్యంగా సేవలు అందించాలని ఆకాంక్షించారు. నిర్మాత దాము మాట్లాడుతూ..

సమాజంలో జర్నలిజాన్ని ఫోర్త్ ఎస్టేట్ అంటారు. వాస్తవాలను నిష్పక్షపాతంగా అందించాలని సూచించారు. సినిమా ఇండస్ట్రీలో జర్నలిస్టులు ఓ భాగమని కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. పోటీ ప్రపంచంలో వేగంగా వార్తలు అందించాలనే ప్రయత్నంలో కొన్ని అవాస్తవాలను ప్రజల్లోకి వెళ్లకుండా చూసుకోవాలని అన్నారు. నిర్మాత ప్రసన్న కుమార్ మాట్లాడుతూ.. సినీ ఇండస్ట్రీ, సినీ జర్నలిస్టులు పరస్పర సహకారంతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉంది. మీడియా విస్తృతి, పరిధి పెరిగిన నేపథ్యంలో వార్తలపై నియంత్రణ అవసరం. సినిమా పరిశ్రమకు మంచి జరిగితే వందలాది మందికి ఉపాధి లభిస్తుంది. ఆ ప్రయత్నంగా జర్నలిస్టులు కృషి చేయాలని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో వైజే రాంబాబు, లక్ష్మీనారాయణ, నాయుడు, ప్రేమ మాలిని, మూర్తి, శివ మల్లాల, నిషాంత్, రాజబాబు, సువర్ణ మాట్లాడుతూ.. జవాబుదారీతనం, నిష్పక్షపాతంగా వ్యవహరించేలా చర్యలు తీసుకొంటామని అన్నారు.

# హిట్ సినిమా స్పీడ్ కి పీవీఆర్ ఐనాక్స్ బ్రేక్!




ఇటీవల తెలుగులో రిలీజ్ అయిన మాలయణ అనువాద చిత్రం మంజుమ్మల్ బాయ్స్ థియేటర్లో పాజిటివ్ టాక్ తో దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. ఇటీవల తెలుగులో రిలీజ్ అయిన మాలయణ అనువాద చిత్రం మంజుమ్మల్ బాయ్స్ థియేటర్లో పాజిటివ్ టాక్ తో దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ తెలుగు లో రిలీజ్ చేయడంతో పెద్ద ఎత్తున రిలీజ్ అయింది. తొలి షోతోనే సినిమా బాగుందనే మౌత్ టాక్ రావడంతో జనాలంతా థియేటర్ల వద్ద క్యూ కట్టారు. ఏప్రిల్ 6న ప్రేక్షకుల ముందుకొచ్చిన సినిమా ఇప్పటికీ హౌస్ ఫుల్ కలెక్షన్లతో దూసుకుపోతుంది. అందులోనూ మెట్రోపాలిటన్ సిటీస్ లో సినిమాకి విశేష ఆదరణ దక్కుతోంది. అయితే ఉన్నపళంగా తెలుగు రాష్ట్రాల్లో పీవీర్ ఐనాక్స్ లో ఈసినిమా ప్రదర్శన నిలిచిపోయింది. దీంతో పీవీఆర్ మల్టిప్లెక్స్ తీరుపై మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఆగ్రహం వ్యక్తం చేసింది. మలయాళ నిర్మాతతో ఉన్న వివాదం కారణంగానే ఆ తాము రిలీజ్ చేసిన సినిమాని ఎలా నిలిపివేస్తారని పీవీఆర్ పై మైత్రీ మూవీస్ డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి అసహనం వ్యక్తం చేసారు. మంచి వసూళ్లు సాధిస్తున్న క్రమంలో అర్ధాంతరంగా ఆపేయడం అన్యాయమని మండిపడ్డారు. ఉన్న పళంగా ప్రదర్శనలు ఆపడం వల్ల ఆర్థికంగా నష్టపోతున్నట్లు పేర్కొన్నారు. ఈ వివాదాన్ని– పీవీఆర్ మల్టిప్లెక్స్ వ్యవహారశైలిని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ పీవీఆర్ మల్టిప్లెక్స్ తీరుపై ఈ రోజు సాయంత్రం అత్యవసర సమావేశం కానుంది. ఛాంబర్ తో సమావేశం అనంతరం రిలీజ్ పై స్పష్టత వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ఏది ఏమైనా పీవీఆర్ ఐనాక్స్ నిలిపివేత అనంతరం ప్రేక్షకుకులు ఇబ్బందికి గురవుతున్నారు. సినిమా ఆపేసారు? అన్న సంగతి తెలియక చాలా మంది థియేటర్ వద్దకు వచ్చి వెనుదిరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే పీవీఆర్ –మంజమ్మల్ బోయ్స్ నిర్మాత మధ్య వివాదం ఏంటి? అన్నది తెలియాల్సి ఉంది. పీవీఆర్ ఐనాక్స్ దేశ వ్యాప్తంగా స్క్రీన్లను కలిగి ఉన్న సంగతి తెలిసిందే. మంజమ్మల్ బాయ్స్ ఫిబ్రవరిలో మలయాళంలో రిలీజ్ అయింది.

# విశ్వం.. పెళ్లిలో గోపిచంద్ బుల్లెట్ల మోత!

చివరగా వచ్చిన బీమా సినిమా కాస్త పరవాలేదు అనిపించినప్పటికీ కమర్షియల్ గా మాత్రం పూర్తి స్థాయిలో లాభాలను అందించలేకపోయింది. యాక్షన్ హీరోగా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును అందుకున్న గోపీచంద్ చాలా కాలంగా సక్సెస్ లేక సతమతమవుతున్నాడు. అతను బాక్స్ ఆఫీస్ వద్ద సాలిడ్ సక్సెస్ అందుకొని చాలా కాలం అయింది. చివరగా వచ్చిన బీమా సినిమా కాస్త పరవాలేదు అనిపించినప్పటికీ కమర్షియల్ గా మాత్రం పూర్తి స్థాయిలో లాభాలను అందించలేకపోయింది. ఇక ఇప్పుడు ఎలాగైనా సక్సెస్ అందుకోవాలి అని సీనియర్ డైరెక్టర్ శ్రీనువైట్ల తో గోపీచంద్ ఒక సినిమా చేస్తున్నాడు. చాలా రోజులుగా విదేశాల్లో షూటింగ్ జరుపుకున్న ఈ సినిమా షూటింగ్ దాదాపు చివరి దశకు చేరుకుంది. ఈ సినిమా డైరెక్టర్ శ్రీనువైట్లకు కూడా ఈ మూవీ చాలా కీలకం కానుంది. ఎందుకంటే చాలా కాలంగా ఆయన కూడా సక్సెస్ చూడలేదు. %నూశ్రీంశీ =ఝుఽ% – చెన్నైస్టోరీలో కొత్త భామ ఈవిడేనా? కాబట్టి ఈ సినిమాతో ఈ కాంబినేషన్ తప్పనిసరిగా మంచి హిట్ కొట్టాల్సిన అవసరం ఉంది. ఇక సినిమా ఫస్ట్ స్ట్రైక్ అంటూ ఒక టీజర్ విడుదల చేశారు. విశ్వం అనే టైటిల్ తో రూపొందుతున్న ఈ సినిమా టీజర్ లో గోపీచంద్ గతంలో ఎప్పుడు లేనంత డిఫరెంట్ క్యారెక్టర్ తో కనిపించబోతున్నట్లు ఇదివరకే దర్శకుడు వివరణ ఇచ్చాడు. ఇక ఈ ఫస్ట్ స్ట్రైక్ లో గోపీచంద్ ఒక గన్నుతో పెళ్లిలోకి వెళ్లి అక్కడ అందర్నీ చంపేసిన విధానం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. అందరూ సంతోషంగా పెళ్లి చేసుకుంటున్న సమయంలో గోపీచంద్ ఎందుకు వారందరిపై బుల్లెట్ల వర్షం కురిపించాడు అనేది సినిమా చూస్తే కానీ అర్థం కాదు. ఒకవేళ అతను ఇందులో సీరియల్ కిల్లరా? లేదంటే దీని వెనక ఏదైనా




బలమైన కారణం ఉందా? అంతేకాకుండా గోపీచంద్ నెగటివ్ షెడ్ లో కూడా కనిపిస్తున్నాడా అనే డౌట్స్ కూడా క్రియేట్ చేశారు. గోపీచంద్ మొదట విలన్ గానే క్లిక్కయ్యాడు. ఆ తర్వాత హీరోగా పలు సినిమాలతో మంచి క్రేజ్ అందుకున్నాడు. ఇక శ్రీనువైట్ల ఈసారి విశ్వంలో ఎలా ప్రజెంట్ చేస్తాడో చూడాలి. మొత్తానికి ఈ ఫస్ట్ లుక్ స్ట్రైక్ అయితే బాగానే హైలెట్ అయింది. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ ఈ సినిమాను నిర్మిస్తోంది. ఒక కావ్య థాపర్ మెయిన్ హీరోయిన్ గా నటిస్తోంది. మరి సినిమా అంచనాలకు తగ్గట్టుగా ఆకట్టుకుంటుందో లేదో చూడాలి.

# బాలీవుడ్ రామాయణం.. నిర్మాతగా యశ్



ఇంటర్నెట్‌డెస్క్: రామాయణ మహా కావ్యాన్ని ఆధారంగా చేసుకుని బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు నితీశ్ తివారీ ఓ ప్రాజెక్ట్ ప్లాన్ చేసిన విషయం తెలిసిందే.

రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి ప్రధాన పాత్రల్లో నటించనున్నారని సమాచారం. ఇప్పుడీ ఈ ప్రాజెక్ట్‌లో కన్నడ నటుడు యశ్ భాగమయ్యారు. భారీ బడ్జెట్‌తో సిద్ధం కానున్న ఈ చిత్రానికి ఆయన సహ నిర్మాతగా వ్యవహరించనున్నారు. ఈమేరకు ఆయన చిత్ర నిర్మాత నమిత్ మల్హోత్రా తో టీమ్ అప్ అయ్యారు.

"భారతీయ సినిమా ఖ్యాతిని ప్రపంచస్థాయికి తీసుకువెళ్లే చిత్రాలు తెరకెక్కించాలనే ఉద్దేశంతో మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్ మొదలుపెట్టా. అలాంటి కథల కోసం ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్నా. ఈక్రమంలోనే లాస్ ఏంజెల్స్‌కు చెందిన ఒక అత్యుత్తమ వీఎఫ్ఎక్స్ స్టూడియోతో పొత్తు పెట్టుకోవాలనుకున్నా. అది నమిత్ మల్హోత్రాదేనని తెలిసి ఆశ్చర్యపోయా. సినీ పరిశ్రమకు సంబంధించి మేమిద్దరం ఎన్నో అభిప్రాయాలు పంచుకున్నాం. కొత్త ప్రాజెక్ట్‌లపై చర్చలు జరుపుతున్న సమయంలో రామాయణం టాపిక్ వచ్చింది. ఈ చిత్రానికి సహ నిర్మాతగా పని చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులను అలరించేలా గ్రాండ్ స్కేల్‌లో దీనిని రూపొందించనున్నాం" అని యశ్ పేర్కొన్నారు.

దర్శకుడు నితీశ్ తివారీకి బాలీవుడ్‌లో మంచి పేరు ఉంది. 'చిల్లర్ పార్టీ' అనే సినిమాతో 2011లో ఆయన దర్శకుడిగా తొలిఅడుగు వేశారు. అప్పట్లో ఈ సినిమా పలు విభాగాల్లో జాతీయ చలనచిత్ర అవార్డులు సొంతం చేసుకుంది. 'దంగల్', 'చిచోరే'తో నితీశ్ సూపర్‌హిట్స్ అందుకున్నారు. ఆయన డ్రీమ్ ప్రాజెక్ట్‌గా రామాయణం రూపొందనుంది. రాముడిగా రణ్‌బీర్ కపూర్.. రావణాసురుడిగా యశ్ కనిపించనున్నారు. ఇప్పటికే ఈ సినిమా షూట్ మొదలైందని.. చిత్రీకరణకు సంబంధించిన విషయాలు బయటకురాకుండా నితీశ్ పక్కా ప్రణాళిక సిద్ధం చేశారని సమాచారం. ముఖ్యంగా సెట్‌లోకి సెల్‌ఫోన్లనూ నిషేధించినట్లు టాక్.

# మినీ రివ్యూ: 'లవ్ గురు'

విజయ్ ఆంటోనీ స్వీయ నిర్మాణంలో రూపొందిన ఈ చిత్రాన్ని ఈద్ స్పెషల్ గా ఈరోజు ఏప్రిల్ 11న మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ విడుదల చేసింది. వైవిధ్యమైన చిత్రాలతో తెలుగు తమిళ భాషల్లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న హీరో విజయ్ ఆంటోనీ. ఇప్పటి వరకూ ఎక్కువగా థ్రిల్లర్ సినిమాలతో అలరించిన విలక్షణ నటుడు.. ఇప్పుడు తొలిసారిగా 'రోమియో' అనే రొమాంటిక్ ఎంటర్టైనర్ తో వచ్చారు. 'లవ్ గురు' పేరుతో తెలుగులోకి డబ్ చేయబడిన ఈ చిత్రంలో మృణాళిని రవి హీరోయిన్ గా నటించింది. వినాయక్ వైద్యనాథన్ దీనికి దర్శకుడు. విజయ్ ఆంటోనీ స్వీయ నిర్మాణంలో రూపొందిన ఈ చిత్రాన్ని ఈద్ స్పెషల్ గా ఈరోజు ఏప్రిల్ 11న మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ విడుదల చేసింది. కథేంటంటే.. మలేసియాలో కేఫ్ నడుపుతున్న అరవింద్ (విజయ్ ఆంటోని).. ఇంటి బాధ్యతల్లో పడి వ్యక్తిగత జీవితాన్ని నిర్లక్ష్యం చేస్తాడు. అందుకే 35 ఏళ్లు వచ్చినా ప్రేమ, పెళ్లికి నోచుకోలేకపోతాడు. తన మనసులో ప్రేమ పుట్టినప్పుడు పెళ్లి చేసుకుంటానని చెబుతూ వచ్చిన అతను, సింగిల్ లైఫ్ కు గుడ్ బై చెప్పలానే లక్ష్యంతో ఇండియాకి తిరిగి వస్తాడు. అనుకోకుండా ఓ చావు ఇంట్లో లీల (మృణాళిని రవి)ని చూసి మనసు పారేసుకుంటాడు.. ఆమెతో జీవితాన్ని ఊహించుకుంటాడు. సినిమా హీరోయిన్ అవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్న లీల.. పెళ్లికి రెడీగా లేదు. అయితే చివరకు హైదరాబాద్ షిఫ్ట్ అవ్వాలనే కండిషన్ మీద అరవింద్ తో మూడు ముళ్ళు వేయించుకుంటుంది. కానీ, పెళ్లైన మరుసటి రోజే లీలా ఇష్టం లేకుండానే ఈ పెళ్లి చేసుకుందనే సంగతి అరవింద్‌కు అర్థమవుతుంది. మరి ఆ తర్వాత ఏమైంది? భార్య మనసు గెలుచుకునేందుకు అరవింద్ ఏం చేశాడు? హీరోయిన్ అవ్వాలనే లీల లక్ష్యం నెరవేరిందా లేదా? లీలా, అరవింద్ చివరకు భార్యా భర్తలుగా ఒక్కటయ్యారా లేదా? అనేది తెలియాలంటే 'లవ్ గురు' సినిమా చూడాల్సిందే. స్టోరీ లైన్ గా చెప్పుకుంటే ఇదేమీ కొత్త కథ కాదు. పెద్దల బలవంతంతో ఇష్టం లేకుండా అమ్మాయి పెళ్లి చేసుకోవడం, పెళ్ళైన తర్వాత భర్తకు నిజం తెలియడం, భార్య మనసు గెలుచుకోడానికి భర్త చేసే ప్రయత్నాలు, క్లైమాక్స్ లో ఇద్దరూ కలిసిపోవడం.. ఇలాంటి లైన్ తో ఇప్పటికే అనేక సినిమాలు వచ్చాయి. ఇప్పుడు 'లవ్ గురు' మూవీ కూడా అదే




క్యాటగిరీకి చెందుతుంది. కాకపోతే పాత రొటీన్ కథనే, ఇక్కడ కొత్తగా ఎంటర్టైనింగ్ గా చూపించే ప్రయత్నం చేశారు. దీనికి సిస్టర్ సెంటిమెంట్ ను కూడా జత చేసిన తీరు ఆకట్టుకుంటుంది. సినిమా ఫస్టాఫ్ అంతా ఫన్నీగా సాగితే, సెకండాఫ్ కు వచ్చే సరికి ఎమోషనల్ గా ఉ ంటుంది. విజయ్ ఆంటోనికి, వీటీవీ గణేష్‌కు మధ్య వచ్చే సీన్స్ నవ్విస్తాయి.

అలానే ఇంటర్వెల్ కు ముందు వచ్చే యోగిబాబు పాత్ర నవ్వించడమే కాదు, కథలో కీలకంగా మారుతుంది. అయితే చాలా సన్నివేశాలు 'రబ్ నే బనాదీ జోడీ' లాంటి హిందీ సినిమాతో సహా కొన్ని పాత తెలుగు చిత్రాలను గుర్తు చేస్తాయి. అరవింద్ చెల్లెలు తాలూకు చేదు జ్ఞాపకాలు, క్లైమాక్స్ లో అరవింద్ – లీలాకు మధ్య వచ్చే సీన్స్ భావోద్వేగానికి గురిచేస్తాయి. కథలో కొత్తదనం లేకపోవడం, స్క్రీన్ ప్లే ప్రేక్షకుడు ఊహించేలా ఉండటం, కొన్ని బోరింగ్ సన్నివేశాలు, పాటలు ఈ సినిమాకు మైనస్ అని చెప్పాలి. అరవింద్‌గా విజయ్ ఆంటోని మెప్పించారు. కామెడీ, ఎమోషనల్ సీన్స్‌లో బాగా నటించారు. మృణాళిని తెరపై అందంగా కనిపించింది కానీ, నటనకు పెద్దగా స్కోప్ దొరికినట్లు అనిపించలేదు. గణేశ్, యోగిబాబు, షా రా నవ్వించే పాత్రలు పోషించారు. మిగతా నటీనటులు కూడా తమ పరిధి మేరకు నటించారు. భాషా శ్రీ తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకునేలా డైలాగ్స్ రాశారు. రొటీన్ కథే అయినప్పటికీ.. సినిమా ఎక్కడా బోర్ కొట్టించకుండా తెరకెక్కించారు. కాబట్టి ఈ వీకెండ్ లో కాలక్షేపం కోసం, కాసేపు సరదాగా నవ్వుకోడానికి 'లవ్ గురు' సినిమాకి వెళ్లొచ్చు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**